# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
26-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 153

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# రేవంత్ వ్యూహాత్మక మౌనం!

## కొండా సురేఖ ఎపిసోడ్‌లో సరికొత్త ఆలోచనలు దిశగా..

**చేతికి మట్టి అంటకుండా**
**హై కమాండ్ కు చర్యల అధికారం**

**అదును చూసి దెబ్బ కొట్టే వ్యూహం**

కొండా సురేఖ పై ఇప్పుడే చర్యలు ఉండవా? క్రమేపి ఆమెను నిర్వీర్యం చేయనున్నారా? తమ చేతిలోకి వస్తే సరి.. లేకుంటే ఎన్నికల సమయంలో పక్కకు తప్పిస్తారా? తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. ఆమె వ్యవహారంలో సీఎం రేవంత్ వ్యూహాత్మక సంయమనం పాటిస్తున్నట్లు స్పష్టం అవుతోంది. విదేశీ పర్యటన ముగించుకుని నిన్ననే హైదరాబాద్ వచ్చారు రేవంత్.



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** కానీ తన అమెరికా పర్యటనను అడ్డుకున్న బిజెపి పై మాత్రమే ఆయన మాట్లాడారు. తనపై వ్యక్తిగతంగా జరిగిన దాడిని మాత్రం ప్రస్తావించలేదు. స్వయంగా ఒక మంత్రి కుటుంబమే పార్టీ అంతర్గత క్రమశిక్షణను, ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చిందనే కోణంలో టిపిసిసి క్రమశిక్షణ కమిటీ ద్వారా హై కమాండ్ కు నివేదికలు వెళ్లేలా కార్యాచరణ నడిపించారు. ఆమె వద్ద పదవి మాత్రమే ఉంచి పవర్ లాక్కోవాలని ఆలోచనలో పావులు కదుపుతున్నారు సీఎం రేవంత్.

## సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..


**ఎన్నికల వయసు తగ్గింపుపై కీలక తీర్మానం!**

**ఎన్నికల్లో పోటీ వయసు 21 ఏళ్లకు తగ్గించాలని తీర్మానం చేసే అవకాశం**

**తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్న రేవంత్ ప్రభుత్వం**

**నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని శాసనసభ్యులకు సూచన**

మిగతా 2లో




# క్యాడర్ ను మరిచిపోతున్న ఎమ్మెల్యేలు!

## తమ పదవులతోపాటు అధికారానికి మాత్రమే పరిమితం

**నామినేటెడ్ పదవుల ప్రకటనలో జాప్యం**

**జాబితాలను పంపడంలో నిర్లక్ష్యం**

**క్షేత్రస్థాయిలో శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు సమీపిస్తోంది. పార్టీ విజయానికి అహర్నిశలు శ్రమించిన క్షేత్రస్థాయి కార్యకర్తలకు ఇంతవరకు న్యాయం జరగలేదన్న ఆరోపణ ఉంది. నామినేటెడ్ పదవుల భర్తీ రోజురోజుకు జాప్యం జరుగుతుండడంతో అసంతృప్తి పెరుగుతోంది. మరోవైపు మంత్రులు, ఎమ్మెల్యేలు కేవలం తమ పదవులు, అధికారిక ప్రాధాన్యతలకి పరిమితం అయ్యారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# సురేఖ ధికారాలకు కోత!

## మంత్రి ఆదేశాలకు కత్తెర

**ఆదేశాలు పాటించవద్దని స్పష్టమైన ఆదేశాలు**

**మాజీ ఓఎస్డీ చుట్టూ ఉచ్చు**

**రాజకీయంగా, చట్టపరంగా కొండా దంపతులను ఉక్కిరి బిక్కిరి చేసే వ్యూహం**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు మంత్రి సురేఖ హాట్ టాపిక్. ఆమెపై వేటు ఉంటుందని అంత ప్రచారం నడిచింది. కానీ రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తున్నారు. హై కమాండ్ సైతం ఇప్పుడే కాదు అన్నట్టు జాప్యం చేస్తోంది.

మిగతా 3లో



# ఇండియా కూటమిలోకి జగన్!

**కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో చర్చలు**

**బిజెపి విషయంలో మారిన వైఖరి**

**ఏపీలో దూకుడుగా ఈడి ఎంట్రీ**

**అందుకే పునరాలోచనలో వైసీపీ అధినేత**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ రాజకీయాల్లో ఒక ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. జగన్మోహన్ రెడ్డి రాజకీయ వైఖరి మారినట్లు ప్రచారం నడుస్తోంది. ఇప్పటివరకు జాతీయ స్థాయిలో ఆయన బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేయడంతో బిజెపికి దగ్గరయ్యారు.

మిగతా 2లో

## జోగి కుటుంబ పంచాయితీలో కొత్త మలుపు!

**బలవంతంగా క్రిస్టియన్ మతంలోకి లాగేందుకు ప్రయత్నం**

అదనపు కట్నం తేవాలని హింస

కోడలు మేఘన సంచలన ఆరోపణలు

గోడు చెప్పుకుంటామంటే ముఖం చాటేసిన జగన్

మేఘన తండ్రి ఆవేదన



## ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి?

**22ఏ బాధితుల సమావేశానికి హాజరైన హరీశ్ రావు**

**లక్షలాది మందికి కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపాటు**

**పొంగులేటి అత్యాశ ఆయన దుఃఖానికి కారణమవుతుందని వ్యాఖ్య**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కుత్బుల్లాపూ ర్‌లో





# విజయవాడ మేయర్‌గా వంగవీటి ఆశా కిరణ్!

**టిడిపిలోకి తెచ్చి నేరుగా ప్రకటించే అవకాశం**

**పొలిటికల్ వర్గాల్లో విస్తృత ప్రచారం**

**మరోవైపు బోండా ఉమామహేశ్వరరావు కుమారుడు పేరు సైతం..**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నాయి.

మిగతా 3లో

# జనసేనలోకి బొత్స ఫ్యామిలీ?!

**కుమార్తె కోసం కీలక నిర్ణయం**

**అగ్రనేతలతో కుటుంబ సన్నిహిత నేతల చర్చలు**

**అదే జరిగితే వైసీపీకి కుదుపు**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ రాజకీయాల్లో ఓ ఆసక్తికర పరిణామం. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనే సీనియర్ మోస్ట్ లీడర్ గా ఉన్న బొత్స ఫ్యామిలీ జనసేనలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది.

మిగతా 2లో



## ప్రధాని మోదీకి ఇద్దరూ సంయుక్తంగా లేఖ

ప్రధాని మోదీకి రాహుల్, ఖర్గే లేఖ.. కులగణనపై కీలక సూచన

కులగణన విధానంపై ఖర్గే, రాహుల్ అభ్యంతరం

ఓపెన్ ఎండెడ్ విధానంతో కులాల వివరాలు తప్పుగా నమోదయ్యే ప్రమాదం

కులాల పేర్లతో డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించాలని డిమాండ్

తెలంగాణ, బిహార్ సర్వేల తరహాలో జాబితా రూపొందించాలని సూచన






# క్యాడర్ ను మరిచిపోతున్న ఎమ్మెల్యేలు!

మరోవైపు ఎమ్మెల్యేల గెలుపులో క్రియాశీలక పాత్ర పోషించిన నాయకులు సైతం అసంతృప్తి గురవుతున్నారు. నామినేటెడ్ పోస్టులపై ఎక్కడికక్కడే మంత్రులతో పాటు ఎమ్మెల్యేలకు నిలదీతలు ఎదురవుతున్నాయి.

**జాబితాలు పంపమని కోరినా..**

అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా రకాల నామినేటెడ్ పోస్టుల భర్తీ జరిగింది. అయితే ఇంకా పెండింగ్లో కొన్ని ఉండగా.. సహకార సంఘాలు, మార్కెట్ కమిటీలు, వివిధ కార్పొరేషన్లు, స్థానిక నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాల్సి ఉంది. కానీ ఒకరికి పదవి దక్కితే మిగతావారు అసంతృప్తికి గురవుతారని ఎక్కడికక్కడే ఎమ్మెల్యేలు, మంత్రులు వెనక్కి తగ్గుతున్నారు. జాబితాలు పంపడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. నియోజకవర్గస్థాయిలో కష్టపడిన నాయకుల వివరాలను



పంపాలని పదేపదే కోరుతున్నా ఎవరూ లెక్క చేయడం లేదు. నామినేటెడ్ పోస్టులకు సంబంధించిన పదవుల కేటాయింపుల్లో 70% పాత నాయకులకు.. 30% కొత్తగా పార్టీలో వచ్చిన వారికి సిఫార్సు చేయాలన్న ఆదేశాలు ఉన్నాయి. కానీ మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ అంతర్గత పోరుకు ఇది ఆజ్యం పోస్తోంది.

**నేతల వైఖరి పై విమర్శలు..**

తాము బాగున్నామా.. తాము పవర్ ఎంజాయ్ చేస్తున్నామా... అన్నట్టు ఉంది కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేల వ్యవహార శైలి. తమకు పదవులు, ప్రాధాన్యతలు దక్కితే చాలు అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల సమయంలో రాత్రింబవళ్లు శ్రమించి పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించిన సాధారణ కార్యకర్తలు, ఇప్పుడు తమ సమస్యలు చెప్పుకోవడానికి మంత్రులు, ఎమ్మెల్యేలు దొరకని పరిస్థితి. కనీసం తమకు రావాల్సిన నామినేటెడ్ పోస్టుల విషయంలోనైనా న్యాయం జరుగుతుందా అంటే నేతల అలసత్వం వల్ల ఆ ప్రక్రియ కూడా జాప్యం అవుతుంది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు క్యాడర్ ను గౌరవించకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..

తెలంగాణ శాసనసభ సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని శాసనసభ్యులకు వెల్లడించారు. అయితే, ఈ సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయి, సభా అజెండా ఏమిటన్న అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ సమావేశాల్లో ప్రభుత్వం ఒక కీలక తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉంది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ సభలో తీర్మానం చేయనున్నారు. అనంతరం దీనిని కేంద్ర ప్రభుత్వానికి పంపి, పార్లమెంటులో సంబంధిత బిల్లును ప్రవేశపెట్టాలని కోరనున్నారు. చట్టసభల్లో యువతకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ మార్పును ప్రతిపాదిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలోనే పేర్కొన్నారు. నియోజకవర్గాల అభివృద్ధి పనులపై కూడా ముఖ్యమంత్రి ఈ సమావేశంలో సమీక్ష జరిపారు. పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆయన ఎమ్మెల్యేలను ఆదేశించారు. భూసేకరణలో జాప్యం జరిగితే ప్రాజెక్టుల నిర్మాణం నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భూసేకరణ, పునరావాసం, అటవీ శాఖ అనుమతులకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి ఎమ్మెల్యే తమ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి?

నిర్వహించిన 22ఏ (22ఏ) బాధితుల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వివేకానందతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ... తప్పు చేసింది ప్రభుత్వమైతే, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. వందలాది కాలనీల అధ్యక్షులు, వేలాది మంది బాధితులు తమ భూములను నిషేధిత 22ఏ జాబితాలో పెట్టారంటూ ఆవేదనతో ఇక్కడికి వచ్చారని హరీశ్ రావు పేర్కొన్నారు. "భూములను 22ఏలో పెట్టడం మీ వంతు.. మళ్లీ వాటిని తొలగించుకోవడానికి దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగడం ప్రజల వంతా?" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సూటిగా నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పును వెంటనే సవరించాల్సిన బాధ్యత మంత్రిపైనే ఉందన్నారు. లక్షలాది మంది ఆస్తులను రాత్రికి రాత్రి 22ఏ జాబితాలో చేర్చి, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపడ్డారు. 30 శాతం కమీషన్ల దురాశతోనే ఈ భూములన్నింటినీ 22ఏలో పెట్టారంటూ హరీశ్ రావు ఆరోపించారు. మంత్రి అత్యాశ ఏదో ఒకరోజు ఆయన దుఃఖానికి కారణమవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ కుట్రల వల్ల లక్షలాది మంది జీవితాలు నాశనమవుతున్నాయని... పిల్లల పెళ్లిళ్లు ఆగిపోతున్నాయని, దవాఖాన ఖర్చుల కోసం ఆస్తులను బ్యాంకుల్లో కుదువ పెడదామంటే బ్యాంకులు సైతం తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాపర్టీల విలువలు పడిపోయి, అప్పు పుట్టక, ఆస్తులు అమ్ముకోలేక బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాబట్టి ప్రజలతో ఆన్‌లైన్ దరఖాస్తులు పెట్టించకుండా, ప్రభుత్వం వెంటనే ఈ 22ఏ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## జనసేనలోకి బొత్స ఫ్యామిలీ?!

(మొదటి పేజీ తరువాయి)

జనసేన పెద్దలతో బొత్స సన్నిహితులు చర్చలు జరుపుతున్నట్లు సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం నడుస్తోంది. విజయనగరం జిల్లా పరిషత్ పీఠాన్ని తన కుమార్తెకు విడిచిపెడితే జనసేనలో చేరేందుకు సిద్ధం అని బొత్స ఓపెన్ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఈ విషయంలో కూటమి పార్టీల మధ్య చర్చించి ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అదే జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక కుదుపే.

**జిల్లాలో హవా..**

విజయనగరం జిల్లాలో బొత్స ఫ్యామిలీ హవా నడుస్తూ ఉంటుంది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న అక్కడ మాత్రం వారిదే హవా. కానీ గతానికి భిన్నంగా ఉంది ఇప్పుడు ఆ జిల్లాలో పరిస్థితి. కూటమి పట్టు బిగుస్తోంది. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో సీనియర్లు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరోవైపు టిడిపి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది విజయనగరం జిల్లా పై. మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి జిల్లా పై ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే బొత్స ఫ్యామిలీ హవాకు అక్కడ బ్రేక్ పడింది. మరోవైపు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో పుంజుకోవడం లేదు. అందుకే బొత్స శిబిరంలో సరికొత్త ఆలోచన మొదలైనట్లు తెలుస్తోంది. ఆ ఫ్యామిలీలో రెండో తరం నాయకుల కోసం జనసేనలో చేరడమే ముఖ్యమని సన్నిహితులు సలహా ఇచ్చినట్లు సమాచారం. అందుకే జనసేన అగ్రనేతలతో బొత్స కుటుంబ సన్నిహిత నేతలు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

**కుమార్తె భవిష్యత్తు కోసం..**

విజయనగరం జిల్లా పరిషత్ చైర్పర్సన్ స్థానానికి తన కుమార్తె డాక్టర్ అనూష పోటీ చేస్తారని బొత్స కొద్ది రోజుల కిందట ప్రకటించారు. కానీ పార్టీ విషయమై ఎటువంటి ప్రస్తావన లేదు. అందుకే ఇప్పుడు జనసేనలోకి బొత్స ఫ్యామిలీ అంటూ అందరిలోనూ అనుమానాలు ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్నారు బొత్స సత్యనారాయణ. ఆపై శాసనమండలిలో వైసిపి పక్ష నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బొత్స మునుపటిలా రాజకీయాలు చేయలేకపోతున్నారు. అందుకే వారసులకు రాజకీయ అవకాశాలు కల్పించాలని చూస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వారా అయితే 2029 వరకు వేచి చూడక తప్పదు. పైగా పార్టీకి ఈసారి అవకాశం ఎలా ఉంటుంది అనేది ఒక అనుమానమే. అందుకే ఇప్పుడు జిల్లా పరిషత్ పీఠాన్ని తన కుమార్తెకు అప్పగించి ఆమె రాజకీయ భవిష్యత్తుకు పునాదులు వేయాలని చూస్తున్నారు. అందుకే జనసేనలో చేరేందుకు సిద్ధపడుతున్నారు. సుదీర్ఘకాలం టిడిపికి ప్రత్యర్థిగా ఉండడంతో ఆ పార్టీలో చేరేందుకు ఇబ్బందులు వస్తాయి. అందుకే జనసేన వైపు బొత్స సత్యనారాయణ మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## రేవంత్ వ్యూహాత్మక మౌనం!

(మొదటి పేజీ తరువాయి)

**రేవంత్ వ్యూహాత్మక మౌనం!**

బీసీ కార్డు కారణం.. ప్రస్తుతం రేవంత్ మంత్రి సురేఖ ఎపిసోడ్ విషయంలో సంయమనం పాటించడానికి ప్రధాన కారణం బీసీలు. ఈ సంక్షోభాన్ని డీల్ చేయడంలో ఆయన జాగ్రత్త పడడానికి బలమైన కారణం కూడా అదే. కొండా సురేఖ రాష్ట్రంలో బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళా మంత్రి. ఈ వేడిలో ఆమెపై తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగింపు చర్యలు చేపడితే విపక్షాలు, ప్రత్యర్థి వర్గాలు దీన్ని అస్త్రంగా మార్చుకుంటాయి. బీసీ నేతలపై వేధింపులు అన్న కోణంలో ప్రచారం చేస్తాయి. పార్టీ అగ్ర నాయకత్వం దీనిని గుర్తించి.. ఆవేశంతో కాకుండా.. ఆలోచనలతో నిర్ణయం తీసుకోవాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ ఎమ్మెల్యేలు,, ఎమ్మెల్సీల ద్వారా ఆమెకు వ్యతిరేకంగా ఒత్తిడి పెంచి.. రేవంత్ తన చేతులకు మట్టి అంటకుండా హై కమాండ్ కె సర్వాధికారాలు అప్పగించారు.

**ఇప్పటివరకు ఆమె సేఫ్..**

ప్రస్తుతం వరకు కొండా సురేఖ సేఫ్. సురక్షితమైన స్థానంలో ఆమె ఉన్నట్టే. క్రమశిక్షణ కమిటీ నోటీసులపై ఆమె ఎప్పటికీ వివరణ సమర్పించారు. కానీ తక్షణ వేటు వేయకుండా విషయాన్ని తాత్కాలికంగా హోల్డ్ లో పెట్టడమే కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న అసెంబ్లీ సమావేశాలు, కీలక బిల్లులు ఆమోదం పూర్తయ్యే వరకు ప్రభుత్వంలో ఎలాంటి అలజడి లేకుండా కొనసాగించాలని.. రాజకీయ వేడి పూర్తిగా చల్లబడిన తర్వాత తగిన సమయంలో సురేఖ రాజకీయ భవితవ్యం పై షాక్ ఇచ్చేలా ఒక నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**మారిన పంథా..**

రేవంత్ ఒక విషయాన్ని స్పష్టంగా గ్రహించారు. తాను కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి అని ఒక నిర్ణయానికి వచ్చారు. నేరుగా తనను టార్గెట్ చేసిన ప్రత్యర్థులకు స్పందించే స్టైలని పూర్తిగా మార్చుకున్నారు. పార్టీ అంతర్గత వేదికల ద్వారా.. హై కమాండ్ పర్యవేక్షణలోనే సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా పావులు కదుపుతూ.. తన అధికార పట్టును మరింత పటిష్టం చేసుకుంటున్నారు. మంత్రిగా ఆమె పవర్ ను పూర్తిగా తగ్గిస్తున్నారు. ఎవరూ ఆమె ఆదేశాలు పాటించకుండా చేస్తున్నారు. కొద్ది రోజులపాటు నాన్చి.. పరిస్థితిని డైవర్ట్ చేసి.. ఒక నిర్ణయానికి రావాలని చూస్తున్నారు రేవంత్. చివరికి ఎలా ముగిస్తారు చూడాలి.

## ఇండియా కూటమిలోకి జగన్!

(మొదటి పేజీ తరువాయి)

2014 నుంచి 2019 మధ్య అదే స్నేహాన్ని కొనసాగించారు. 2019 నుంచి 2024 మధ్య అంతకుమించి అన్నట్టు వ్యవహరించారు. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పుడు బిజెపికి దూరంగా ఉండడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమితో చేతులు కలపాలన్న కఠిన నిర్ణయానికి ఆయన వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. బెంగళూరు వేదికగా కాంగ్రెస్ అగ్ర నేతలతో ఆయన వరుసగా భేటీలు అవుతూ వస్తున్నారన్నది ఈ ప్రచార సారాంశం. ప్రధానంగా ఇటీవల ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తో జగన్ భేటీ అయినట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

**బిజెపితో సన్నిహితంగా..**

వాస్తవానికి ఎన్డీఏలో అధికారికంగా చేరలేదు జగన్మోహన్ రెడ్డి. కానీ అంతకుమించి అన్నట్టు వారి మధ్య బంధం నడిచింది. ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో కేంద్రంలోని బిజెపి నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వానికి కీలక బిల్లులు, విధానపరమైన నిర్ణయాలు జగన్ మద్దతు తెలుపుతూ వచ్చారు. ఇప్పటివరకు కూడా అదే మద్దతు కొనసాగిస్తూ వస్తున్నారు. కానీ అది ఆయన రాజకీయ విధానాన్ని ప్రశ్నించేలా ఉంది. అన్నింటికీ మించి కేంద్ర వైఖరి మారుతోంది. కేంద్ర దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగి నేరుగా విచారణలు చేపడుతుండడం.. తమ పార్టీ నేతలను అరెస్టు చేస్తుండడంతో ఆయన వైఖరి మారుతున్నట్టు అర్థం అవుతుంది. ఆపై టిడిపి అధినేత చంద్రబాబుకు కేంద్ర పెద్దలు ఎనలేని ప్రాధాన్యమిస్తున్నారు. మరి ఇటువంటి సమయంలో బిజెపిని నమ్ముకుంటే తనకు ఎటువంటి అండ ఉండదని భావించి ఆయన ఇండియా కూటమి వైపు చూస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది.

**జాతీయ రాజకీయాలు..**

జగన్ వైఖరి మారడానికి జాతీయ రాజకీయాలు కూడా ఒక కారణం. ప్రస్తుతం జాతీయ స్థాయిలో బిజెపి గ్రాఫ్ తగ్గుతోంది అని అంచనా వేస్తున్నారు జగన్. నిరుద్యోగంతో పాటు పేపర్ లీకేజీల అంశం యువతలో బిజెపి పట్ల వ్యతిరేక భావన పెంచింది అని.. కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందని.. రాబోయే ఎన్నికల నాటికి ఇది మరింత తీవ్రంగా మారుతుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ క్రమంలో బిజెపికి మరింత దగ్గరగా ఉండడం కంటే.. జాతీయస్థాయిలో పుంజుకుంటున్న కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి వైపు ఉండడమే మేలన్న నిర్ణయానికి ఆయన వచ్చినట్లు సమాచారం. అందులో భాగంగానే కాంగ్రెస్ అగ్ర నేతల్లో ఒకరైన కేసి వేణుగోపాల్ చర్చించినట్లు తెలుస్తోంది.

**ఇతర పార్టీల అండ కోసం..**

జాతీయస్థాయిలో ఏదో ఒక పార్టీ అండదండలు ఇప్పుడు జగన్మోహన్ రెడ్డికి అవసరం. బిజెపి పెద్దల ఆదేశాలు లేనిదే ఏపీలోకి ఈడి ఎంట్రీ ఇచ్చే అవకాశం లేదు. వివేకానంద రెడ్డి హత్య కేసులో ఈడి దర్యాప్తు సంచలనంగా మారింది. మరోవైపు మద్యం కుంభకోణం కేసుల్లో కూడా ఈ డి అరెస్టులు ప్రారంభించింది. బిజెపిని నమ్ముకుంటే ఇలా చేసిందేమీ అనే బాధ జగన్లో ఉంది. అటు రాజకీయంగా నేరుగా బిజెపితో కలవలేని పరిస్థితి. ఇటువంటి సమయంలో జాతీయస్థాయిలో ఇతర రాజకీయ పార్టీల అండదండలు కావాలంటే ఇండియా కూటమి శరణ్యం. అందుకే అటువైపు అడుగులు వేస్తున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం బలంగా నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి. ఒకవేళ జగన్ ఇండియా కూటమివైపు అడుగులు వేస్తే మాత్రం ఏపీ రాజకీయాల్లో సమూల మార్పులు చోటు చేసుకునే పరిస్థితి ఉంటుంది.

## జోగి కుటుంబ పంచాయితీలో కొత్త మలుపు!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** రెండు తెలుగు రాష్ట్రాల్లో మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబ వ్యవహార శైలి రచ్చకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఆయన కోడలు మేఘన తనను చిత్రహింసలకు గురి చేస్తున్నారు అంటూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తర్వాత ఇరు వర్గాల వారు ఒకచోట సమావేశం కావడం.. వాటికి సంబంధించిన వీడియోలు బయటకు రావడం సంచలనంగా మారింది. రకరకాలుగా ప్రచారం నడిచింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి జోగి రమేష్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. తన కుటుంబ వ్యవహారం రచ్చ కావడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ లను టార్గెట్ చేసుకుని విమర్శలు చేశారు. మరోవైపు కొన్ని మీడియా ఛానళ్లపై కూడా విరుచుకుపడ్డారు. తమ కోడలు మేఘనను కూతురు కంటే ఎక్కువగా చూసుకున్నామని.. ఎటువంటి ఇబ్బంది పెట్టలేదని.. రాజకీయ ప్రేరేపితంగానే ఆమె అలా వ్యవహరించారని మాట్లాడారు జోగి రమేష్. అయితే దీనిపై కోడలు మేఘన, ఆమె తండ్రి మీడియా ముందుకు వచ్చి కన్నీటి పర్యంతమవుతూ సంచలన విషయాలు బయట పెట్టారు.

**కోట్లాది రూపాయల ఆస్తులు ముట్టజెప్పినా..**

వివాహ సమయంలో కేజీ నర బంగారం.. కోట్లాది రూపాయల ఆస్తులు ముట్ట చెప్పానని.. అయినా సరే తన కుమార్తెను చంపేందుకు ప్రయత్నం చేశారంటూ





మేఘన తండ్రి సంచలన ఆరోపణలు చేశారు. తమను టిడిపి వారిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారంటూ మండిపడ్డారు. సంసారానికి పనికిరాడు అన్న విషయాన్ని మరుగున పెట్టి.. రాజకీయ ప్రచారం కోసం.. కోట్లాది రూపాయల కట్న కానుకల కోసం తన కూతుర్ని బలిపశువు చేశారంటూ మేఘన తండ్రి కన్నీరు మున్నీరు అయ్యారు. తాము జగన్మోహన్ రెడ్డిని కలిసే ప్రయత్నం చేస్తే ఆయన ఆసక్తి చూపలేదని.. సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి తమ గోడును వెళ్ళబోసుకున్నామని.. ఆయన తీవ్ర జాప్యం చేసి చివరకు రాజి కుట్రకు తెర లేపారని ఆరోపించారు. గత్యంతరం లేని స్థితిలోనే తాము మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ను ఆశ్రయించినట్లు చెప్పుకొచ్చారు.

**మతం పేరుతో వేధింపులు..**

మరోవైపు మేఘన జోగి రమేష్ కుటుంబ మత వేధింపులకు సంబంధించి సంచలన విషయాలను బయటపెట్టింది. వారిది క్రిస్టియన్ మతం అని.. హిందువులుగా బిల్డప్ ఇస్తుంటారంటూ ఆరోపించారు. వివాహం జరిగిన తర్వాత హిందూ దేవుళ్ళ చిత్రపటాలతో పూజలు చేసేందుకు సిద్ధపడితే జోగి రమేష్ భార్య శకుంతల అడ్డుకున్న విషయాన్ని ప్రస్తావించారు. పైగా హిందూ దేవుళ్లను దారుణంగా అవమానించారంటూ చెప్పుకొచ్చారు మేఘన. హిందూ దేవుళ్లకు ఇద్దరు భార్యలు అంటూ ఎద్దేవా చేసేవారని.. తనను బలవంతంగా క్రిస్టియన్ మతంలోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేశారంటూ ఆరోపించారు. తనను బాగా చూసుకున్నారు అనేది అబద్ధం అని.. చాలాసార్లు చంపేందుకు కూడా ప్రయత్నం చేశారంటూ ఆరోపించారు. కేవలం శారీరక మానసిక వేధింపులే కాదు.. అదనపు కట్నం కోసం హింసించే వారని.. అదనపు కట్నం తెస్తే తన కుమారుడిలో ఫీలింగ్ వస్తాయని స్వయంగా శకుంతలా చెప్పారంటూ మేఘన ఆరోపించడం సంచలనంగా మారింది. జోగి రమేష్ కుటుంబ పంచాయితీ మరో మలుపు తిరిగింది.

# సురేఖ ధికారాలకు కోత!

(మొదటి పేజీ తరువాయి)



అయితే ఒక సీన్ మాత్రం స్పష్టమవుతోంది. ఆమె పేరుకే మంత్రి కానీ.. ఆమె వద్ద ఉన్న అధికారాలను పూర్తిగా కత్తెర వేసినట్లు తెలుస్తోంది. మంత్రి పదవి నుంచి అధికారికంగా తొలగించకపోయినా.. ఆమెకు ఉండే అధికారాలను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా అటవీ శాఖపై ఆమెకు ఉన్న పట్టును సడలించే దిశగా సంచలన నిర్ణయాలు తీసుకున్నారు.

**డిప్యూటేషన్లు రద్దు..**

రేవంత్ మంత్రివర్గంలో కొండా సురేఖకు అవకాశం దక్కింది. అప్పట్లో ఆమెకు అటవీ శాఖ మంత్రిగా పదవి దక్కింది. ఆమె బాధ్యతలు చేపట్టిన తర్వాత అటవీ శాఖలో చాలా రకాల డిప్యూటేషన్లు నడిచాయి. ఇతర శాఖల అధికారులను సైతం డిప్యూటేషన్ల పై నియమించారు. అయితే ఇప్పుడు మరో మాటకు తావు లేకుండా ఆ డిప్యూటేషన్లను రద్దు చేశారు. ఆ అధికారులంతా తమ మాతృ శాఖలకు వెళ్లిపోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. అదే సమయంలో సురేఖ పేషీ కేంద్రంగా సాగినట్లు చెబుతున్న అక్రమ సెటిల్మెంట్ లపై పోలీసులు ఉక్కు పాదం మోపారు. మంత్రి తరఫున దందాలు, బెదిరింపులకు పాల్పడినట్లు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమె మాజీ ఓఎస్డి సుమంత్ ప్రధాన అనుచరులను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా సభ్యులను వరుసగా కస్టడీలోకి తీసుకుంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సాగించిన బెదిరింపుల పర్వం, 10 కోట్ల రూపాయల వసూళ్ల లెక్కలను బయటపెడుతున్నారు. ఇదంతా మంత్రి సురేఖను రాజకీయంగా, పాలనాపరంగా పూర్తిగా బలహీనం చేయడమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**సెటిల్మెంట్లపై ఫోకస్..**


ముఖ్యంగా మాజీ ఓఎస్డి సుమంత్ నెట్వర్క్ ను పూర్తిగా అదుపులోకి తీసుకొని.. సురేఖ పేషీ కేంద్రంగా జరిగిన అంతర్గత ఆర్థిక లావాదేవీలు అన్నింటిని.. ఒక్కొక్కటిగా వెలుగులోకి తెచ్చి.. సురేఖను ఎరకాటంలో పెట్టాలన్నది ప్రణాళికగా తెలుస్తోంది. అసలు ఓ ఎస్ టి గా పనిచేసిన వ్యక్తి ఎవరి ఆజ్ఞలతో ఇలాంటి భారీ సెటిల్మెంట్లు చేశారు? ఆయన వెనుకుండి నడిపించిన అసలు శక్తులు ఎవరు? ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి వసూలు చేసిన కోట్లాది రూపాయల నగదు ఎక్కడికి మళ్ళింది? వంటి కీలక ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఈ కేసులో పోలీసులు సహకరిస్తున్న కాల్ డేటా, వాట్సాప్ చాట్ లావాదేవీల వివరాలు బయటకు వస్తే పరిస్థితి మరింత తీవ్రంగా మారనుంది. మంత్రి సురేఖ దంపతులు నేరుగా రాజకీయంగానే కాకుండా.. చట్టపరంగా కూడా కోలుకోలేని చిక్కులు తెచ్చుకున్నట్టే. చివరికి ఏం జరుగుతుందో చూడాలి.

## అంచెలంచెలుగా ఎదిగిన కరుణాకర్

### ఐపిఎస్ ప్రమోషనం కొట్టడంతో గ్రామస్థుల హర్షం

కడప:కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన పుల్ల కరుణాకర్ ఐపీఎస్ హోదా పొందారు. 2009 సంవత్సరంలో గ్రూప్ -1కు ఎంపికై కడప జిల్లా ప్రొద్దుటూరులో 2010 సంవత్సరంలో డీఎస్పీగా విధుల్లో చేరారు. అనంతరం వివిధ జిల్లాల్లో డీఎస్పీగా, 2017లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొందారు. వివిధ శాఖల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 2021 సంవత్సరంలో ఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన.. హైదరాబాద్లో డీసీపీ (ట్రాఫిక్)గా విధులు నిర్వర్తించారు. పలు జిల్లాల్లో నాన్ కేడర్ ఎస్పీగా కీలక బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం హైదరాబాద్లో ఇంటెలిజెన్స్ ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సోమవారం కేంద్ర హోం శాఖ రాష్ట్రంలోని పలువురు నాన్ కేడర్ ఎస్పీలకు ఐపీఎస్ హోదా కల్పించగా.. వారిలో కరుణాకర్ ఒకరు. ఎంతో కష్టపడి డీఎస్పీ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఐపీఎస్గా ఎదిగిన ఆయన ప్రతిభను ఉప్పల్ గ్రామస్థులు, కుటుంబసభ్యులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రధాని మోదీకి ఇద్దరూ సంయుక్తంగా లేఖ



కులగణనలో వివరాల సేకరణ విధానంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి ఇద్దరూ సంయుక్తంగా లేఖ రాశారు. ప్రస్తుతం ప్రతిపాదించిన 'ఓపెన్ ఎండెడ్' విధానాన్ని మార్చి.. కులాల పేర్లతో కూడిన డ్రాప్డౌన్ జాబితాను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రస్తుత విధానంలో వ్యక్తులు తమ కులం పేరును ఎలా చెబితే అలా నమోదు చేస్తారని ఖర్గే, రాహుల్ పేర్కొన్నారు. ఒకే కులానికి ప్రాంతాలను బట్టి వేర్వేరు పేర్లు, ఉపకులాలు, భాషా రూపాలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఒకే కులానికి చెందినవారి వివరాలు వేర్వేరు పేర్లతో నమోదైతే.. ఆ కులం వేలాది ఎంట్రీలుగా విడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా జరిగితే కులాల జనాభాపై కచ్చితమైన సమాచారం లభించదని తెలిపారు. ఫలితంగా వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, ఇతర అణగారిన వర్గాల స్థితిగతులపై సరైన అంచనా సాధ్యం కాదన్నారు. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలపై దీని ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా దేశంలో ఓబీసీల వాస్తవ జనాభా ఎంత అన్నది కూడా తేలకపోవచ్చని కాంగ్రెస్ నేతలు అన్నారు. కులగణనలో 'బ్యాక్వర్డ్ క్లాస్' అనే పదం చేర్చలేదని లేఖలో ప్రస్తావించారు. కులాల పేర్లతో డ్రాప్డౌన్ జాబితా రూపొందించాలని వారు సూచించారు. ఎస్సీ, ఎస్టీల గణనలో ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల ప్రభుత్వ జాబితాలు, ఆంథ్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వివరాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించవచ్చన్నారు. తెలంగాణ, బీహార్ కుల సర్వేల్లోనూ ఇదే విధానాన్ని అనుసరించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రశ్నావళిని రద్దు చేసి.. రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ఖర్గే, రాహుల్ కోరారు.

# విజయవాడ మేయర్గా వంగవీటి ఆశా కిరణ్!

(మొదటి పేజీ తరువాయి)

ముందుగా మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం అవుతోంది. మరోవైపు బలమైన అభ్యర్థులను రంగంలోకి దించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈసారి అన్ని నగరాల్లో కూటమి జెండా ఎగురవేయాలని చూస్తోంది. ప్రధానంగా విశాఖ, విజయవాడ, తిరుపతి కార్పొరేషన్లపై ఫుల్ ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో విజయవాడ కార్పొరేషన్ మేయర్ పీఠంపై ఒక ప్రచారం ఉధృతంగా ఉంది. ఈసారి మేయర్ పీఠం వంగవీటి వారసురాలు ఆశా కిరణ్ కు దక్కబోతున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం బలంగా వినిపిస్తోంది.

**గత ఏడాదిగా యాక్టివ్..**

వంగవీటి మోహన్ రంగ కుమార్తె ఆశా కిరణ్ గత ఏడాదిగా చాలా యాక్టివ్ గా పని చేస్తున్నారు. విజయవాడ కేంద్రంగా ఒక కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. గత ఏడాది ఆమె క్రియాశీలక పాత్రలోకి వచ్చారు. రంగా రాధా మిత్రమండలి పూర్వ వైభవం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. విస్తృతంగా పర్యటనలు కూడా చేస్తున్నారు. అయితే ఆమె త్వరలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. తరువాత జనసేన లో చేరుతారని టాక్ నడిచింది. కానీ ఇప్పుడు తెలుగుదేశం పార్టీలోకి ఎంట్రీ ఇచ్చి ఏకంగా విజయవాడ మేయర్



కాబోతున్నారు అనేది ఒక వార్త పొలిటికల్ వర్గాల్లో హల్చల్ చేస్తోంది.

**సోదరుడు టిడిపిలో..**

ప్రస్తుతం ఆశా కిరణ్ సోదరుడు వంగవీటి రాధాకృష్ణ తెలుగుదేశం పార్టీలోనే ఉన్నారు. 2004లో రాజశేఖర్ రెడ్డి పిలుపుతో కాంగ్రెస్లో చేరారు రాధాకృష్ణ. ఆ ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. చిన్న వయసులోనే అసెంబ్లీలో అడుగు పెట్టారు. తర్వాత ప్రజారాజ్యం పార్టీలో చేరారు. 2009లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఓటమి చవి చూశారు. 2019 ఎన్నికల నాటికి తెలుగుదేశం పార్టీలో చేరారు కానీ ఆ పార్టీ తరఫున పోటీ చేయలేదు. ప్రచారం మాత్రం ఉధృతంగా చేశారు. 2024 ఎన్నికల్లో సైతం పోటీ చేయలేదు. కూటమి తరుపున విస్తృతంగా ప్రచారం చేశారు. ఇప్పుడు ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తారని ప్రచారంలో ఉంది. అయితే అంతకంటే ముందే ఆయన సోదరి ఆశా కిరణ్ కు మేయర్ అభ్యర్థిగా అవకాశము ఇస్తారని తెలుస్తోంది.

**బోండాకు హామీ?**

మరోవైపు విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు కుమారుడుకు మేయర్ పదవి హామీ ఇచ్చినట్లు ఆ మధ్యన ప్రచారం నడిచింది. మంత్రి పదవి రాకపోవడంతో బోండా ఉమ మొన్న ఆ మధ్యన అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యలో వైసీపీ మాజీమంత్రి అంబటి రాంబాబుతో వేదిక పంచుకోవడం వివాదాస్పదం అయింది. అయితే ఈ కారణాలతో హై కమాండ్ పిలిచి మాట్లాడింది. తన ఇద్దరి కుమారులతో కలిసి అధినేత చంద్రబాబుతో పాటు లోకేష్ ను కలిశారు ఉమా. ఆ సమయంలోనే బోండా ఉమామహేశ్వరరావు కుమారుడికి మేయర్ పదవి అంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కానీ ఇప్పుడు వంగవీటి ఆశాకిరణ్ పేరు తెరపైకి వస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..



## ఉచిత పథకాలకు తాను వ్యతిరేకం

### వాటితో ఆర్థికంగా తీరని నష్టం

### విద్యావైద్యంలనేఉచితంగా ఇవ్వాలి

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

నెల్లూరు: మరోసారి ఉచిత పథకాలపై తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్టుగా చెప్పేశారు వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు.. నెల్లూరు జిల్లా వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన.. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, రాష్ట్రంలో అమలవుతున్న ఉచిత పథకాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఉదయగిరి ప్రాంత ప్రజలు తనను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని వెంకయ్య నాయుడు గుర్తుచేసుకున్నారు. ఈ ప్రాంత ప్రజలే తనను ఉదయగిరి నుంచి ఉపరాష్ట్రపతి స్థాయి వరకు తీసుకెళ్లారని అన్నారు. తన ఎదుగుదలలో ఈ ప్రాంత ప్రజల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇక, రాష్ట్రంలో అమలు చేస్తున్న ఉచిత పథకాలకు తాను వ్యతిరేకమని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు వంటి పథకాల వల్ల ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థపై భారం పెరిగే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అయినా, గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలైనా ఉచిత పథకాలను నిలిపివేయాలని అభిప్రాయపడ్డారు. కానీ, ప్రజలకు ఉచితంగా అందించాల్సింది విద్య, వైద్యం, ఆరోగ్యం వంటి ప్రాథమిక సదుపాయాలని వెంకయ్య నాయుడు అన్నారు. పేదలకు మాత్రమే అవసరమైన సంక్షేమ పథకాలు అందేలా విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందితే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం ప్రపంచ దేశాలకు దీటుగా అభివృద్ధి బాటలో ముందుకు సాగుతోందని వెంకయ్య నాయుడు అన్నారు. దేశ ఆర్థిక, మౌలిక రంగాల్లో పురోగతి సాధిస్తూ అంతర్జాతీయ స్థాయిలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోందని పేర్కొన్నారు భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు..

## తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి అభివృద్ధి

### రూ.840.41 కోట్లతో విస్తరణకు కేంద్రం ఆమోదం

### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి 365బీబీ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుట్టాయగూడెం-ఎల్ఎన్డీ పేట, పట్టిసీమ- కొవ్వూరు సెక్షన్ల మధ్య 45.09 కిలోమీటర్లతో రహదారి ఉన్నతీకరణ కోసం రూ.840.41 కోట్లతో కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 45 కిలోమీటర్ల 2 లేన్ల జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్లు నిర్మించనున్నట్లు గడ్కర్ తెలిపారు. ఈ రహదారి ఉన్నతీకరణతో పోలవరం ప్రాజెక్ట్, పరిసర గ్రామాలకు కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతం పొగాకు, చెరకు, ఫామాయిల్ తోటలతో నిండి ఉంటుందని.. ఈ హైవే అభివృద్ధితో మౌలిక సదుపాయాలు మెరుగు అవుతాయన్నారు. పంటల రవాణా వేగంగా, సురక్షితంగా జరుగుతుందని చెప్పారు. పంట పొలాల నుంచి మార్కెట్కు అనుసంధానం పెరుగుతుందని, స్థానికంగా జీవనోపాధి మెరుగవుతుందని గడ్కరీ పేర్కొన్నారు. అప్గ్రేడ్ చేసిన జాతీయ రహదారితో తెలుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ పెరగడంతో పాటు, ఇరురాష్ట్రాల ప్రయాణికులకు, పర్యాటకులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తులు సులభంగా ఘాట్ల వద్దకు చేరుకోవడానికి, పోలవరం ప్రాజెక్ట్ సందర్శించేందుకు వీలవుతుందన్నారు.

## మహిళా సాధికారతపై లఘు చిత్రం

### విడుదల చేసిన మంత్రి సీతక్క

హైదరాబాద్: మహిళా సాధికారత ఇతివృత్తంగా నిర్మించిన లఘు చిత్రాన్ని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి దనసారి అనసూయ సీతక్క ఆవిష్కరించారు. ఒక సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన ఆడపిల్ల ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, ఆఖరుకు తనకు ఉన్న లంగ్ కాన్సర్ ను కూడా జయించి ఎం÷ూ సాధించిన ఇతివృత్తంతో సచివాలయం అధికారి, రచయిత, దర్శకుడు తిరుపతి పటేల్ సి÷-దదెంకి చిత్రికరించారు. ఈ సందర్భంగా దర్శకుడు తిరుపతిని మంత్రి అభినందించి సన్మానించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శృతి ఓజ, ఆస. సురేష్ కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ, ఆఫీసర్స్ ప్రెసిడెంట్, సెక్రటేరియట్, బపబి లలిత కుమారి, అసిస్టెంట్ సెక్రటరీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, శ్రీ నరేష్ ఖఖీక్ష, ఆస. సాయి ఆచార్య స్వాధ్యాయ ఫౌండర్ దర్శకుడిని అభినందించడం జరిగినది. జయ శ్రీ మూగ గారు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్ర దర్శకుడు తిరుపతి మంత్రి వర్యులుకు, శృతి ఓఝా, అనిత రామచంద్రన్ చిత్రం నిర్మించిన జయ కార్యక్రమంలో పాల్గొన్న అందరికి కృతజ్ఞతలు తెలియజేశాడు.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

**అమెరికా, ఇరాన్ యుద్ధంలో కొత్త అధ్యయం మొదలయ్యింది. ఇరాన్‌ను ఆయుధాలతో దెబ్బతీయడం కుదరని పని అని అమెరికాకు తెలిసొచ్చింది. దీంతో ఇక ఆర్థిక యుద్ధం మొదలు పెట్టింది. దీంట్లోనూ ప్రపంచ దేశాలను లాగే యత్నం చేస్తోంది. ఇరాన్‌తో సంబంధాలు పెట్టుకునే దేశాలపైనా ఆంక్షలు కొనసాగిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయుధంతో పోరాటమైనా, ఆర్థిక పోరాటమైనా తన పంతమే నెగ్గాలన్నది ట్రంప్ వాదనగా ఉంది. నేను చెప్పినట్లు వినాలన్న ధోరణితో అమెరికా ఇప్పుడు ప్రపంచ దేశాలకు హెచ్చరికలు చేస్తోంది.**

# ఇరాన్‌పై ట్రంప్ ఆర్థిక యుద్ధం !

ఈ క్రమంలో ఇరాన్‌పై మొన్నటి వరకు భౌతిక దాడులకు పాల్పడిన అమెరికా ఇప్పుడు రూటు మార్చింది. సరికొత్త ఆంక్షల పేరుతో టెహ్రాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని యోచిస్తున్నది. ఇందులో భాగంగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెం ఇరాన్‌పై చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆంక్షలను ప్రకటించారు. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌క్యాస్ట్' పేరుతో ఈ కొత్త ఆంక్షల ప్యాకేజీని ప్రకటించారు. కాగా, ఇరాన్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గాలపై ప్రభావం చూపుతున్నది. పెరిగిన చమురు ధరలు జీవన వ్యయంపై ఆందోళనలను పెంచాయి. పెట్రోల్,డీజిల్ ధరలు ఏడాది క్రితం కంటే చాలా ఎక్కువగా ఉండంతో అమెరికాతో పాటు అన్ని దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. మరో వైపు ఇరాన్‌పై ఆంక్షలను ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు స్వాగతించారు. ఇరాన్ ఆర్థిక మూలాలను పూర్తిగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. టెహ్రాన్‌పై ఇది ఒక 'ఆర్థిక డి-డే' లాంటిదని హెచ్చరించారు. డిజిటల్ ఆస్తులు, టెక్నాలజీ, బంగారం, విమానయానం, నౌకా రవాణా వంటి కీలక రంగాలను ఈ ఆంక్షల పరిధిలోకి తీసుకొచ్చారు. ఇరాన్‌తో వ్యాపారం కొనసాగించే ఇతర దేశాలు, సంస్థలపై కూడా ద్వితీయ స్థాయి ఆంక్షలు విధించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో పాటు ఇరాన్ చమురు ఆదాయం, ఆయుధాల సేకరణ, సైబర్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న 60కి పైగా వ్యక్తులు, కంపెనీలు, నౌకలపై కూడా ఆంక్షలు విధించారు. ఇరాన్‌తో ఆర్థిక పోరులో ఇది చివరి అంకమని అమెరికా ప్రకటించింది. ఇరాన్‌తో సంబంధాలు తెంచుకోవాలని ప్రపంచ దేశాల నాయకులను కోరారు. మీరు మా వైపు ఉంటారా లేక మాకు వ్యతిరేకంగా ఉంటారా అని అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటికే ఇరాన్‌కు మద్దతు ఇస్తున్న సుమారు 60 సంస్థలు, విదేశీ నౌకలపై అమెరికా నిఘా పెట్టింది. సహకరించే ఇతర దేశాలకూ ఆంక్షల భయం ఉంటుందని తెలిపారు. ఇరాన్‌తో ఆర్థికంగా భాగస్వామ్యం వహించే ఏ దేశమైనా ఏకాకిగా మిగిలిపోతుందని బెసెంట్ తెలిపారు. ఇరాన్‌పై కొన్నినెలలుగా దాడులు చేసిన అమెరికా ఇప్పుడు ఆర్థికంగా వెన్నువిరిచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. అంతర్జాతీయంగా ఇరాన్‌కున్న ఆర్థిక సంబంధాలను తెంచేయడమే లక్ష్యంగా అగ్రరాజ్యం కొత్త ఆంక్షలను ప్రకటించింది. టెహ్రాన్‌తో సంబంధాలు కొనసాగిస్తూ, నగదు అక్రమ చలామణిలో దానికి తోడ్పడే దేశాలను డాలరు వ్యవస్థ నుంచి దూరం చేస్తామని యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ప్రకటించారు. దీనికి ఇరాన్ దీటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కోవడానికి తమ వద్ద రెండేళ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార చర్యలు తప్పవని బదులిచ్చింది. పంపారని పేర్కొన్నారు.యూఎస్ ప్రకటనపై ఇటు ఇరాన్ ప్రభుత్వం కూడా ఘాటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కొవడానికి మా వద్ద రెండేండ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార దాడులు తప్పవని బదులిచ్చింది. ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదనీజాదేహ్ మాట్లాడుతూ.. అమెరికా ఆంక్షలను ఎదుర్కొనేందుకు మేం సర్వసన్నద్ధంగా ఉన్నాం. శత్రువులు మాపై ఆర్థిక ఉగ్రవాద దాడికి పాల్పడాలని చూస్తున్నారు. కానీ, మా వద్ద కూడా తగిన సాధనాలు ఉన్నాయి. ఇకపై మాది కేవలం రక్షణేళి కాదు, శత్రువులు మా దాడి కోసం ఎదురుచూడాలని హెచ్చరించారు. అమెరికా ఆంక్షలను చైనా, రష్యా అంగీకరిం చలేదని, ఇతర దేశాలు కూడా ప్రతిఘటిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహసెన్ రెజాయ్ మరింత ఘాటుగా స్పందించారు. అమెరికాకు సహకరించే ఏ దేశమైనా 'భూకంపం లాంటి' ప్రతీకారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పొరుగు దేశాలు సహకరిస్తే పర్షియన్ గల్ఫ్ లేదా హార్ముజ్ జలసంధి నుంచి చుక్కనూనె కూడా బయటకు



ఇరాన్ పై అమెరికా ఆంక్షలు విధించడం కొత్తేం కాదు. ఇరాన్‌కు ప్రపంచంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్టడమే తాజా ఆంక్షల లక్ష్యమని బెసెంట్ ప్రకటించారు. అయితే యూఎస్ నుంచి ఎదురయ్యే ఒత్తిడిని తమ వాణిజ్య భాగస్వాములు గట్టిగా వ్యతిరేకిస్తారని టెహ్రాన్ విశ్వాసం వ్యక్తంచేసింది. ఈ మేరకు ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ గాలిబఫ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఇతర దేశాలతో ఇరాన్‌కున్న సంబంధాలను తెగ్గొట్టే స్థితిలో అమెరికా లేదన్నారు. అమెరికన్ల ప్రగల్భాలను ఎవరూ నమ్మరు. అమెరికా

ఆంక్షలప్రకటనను పరిగణనలోకి తీసుకోబోమని మా వాణిజ్య భాగస్వాములు ఇప్పటికే మాకు సందేశాలు

వెళ్లనివ్వబోమని తేల్చిచెప్పారు. మరోవైపు ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదానీజాదేహ్ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. అమెరికాకు మరో ఓటమి తప్పదు. వాషింగ్టన్ విధించిన కొత్త ఆంక్షలను ఎదుర్కోవ డానికి మా వద్ద రెండేళ్ల ప్రణాళిక ఉంది. ఇరాన్ ప్రజలు, దేశ అధికారుల సంకల్పాన్ని పరీక్షించడానికి వారు చేయగలిగిందంతా చేశారు. కానీ ప్రతిసారీ విఫలమయ్యారని యూఎస్‌కు కౌంటర్ ఇచ్చారు. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' పేరిట 60 సంస్థలు, వ్యక్తులు, నౌకలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇరాన్ సైనిక కార్యకలాపాలు, పెట్రోలియం, పెట్రోకెమికల్ వాణిజ్యంతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ వాటిని ప్రకటించింది.



# అమెరికా చదువులపై విద్యార్థుల్లో అనాసక్తి

### ఉద్యోగార్థుల్లోనూ పెరుగుతున్న నిరాశ

### ట్రంప్ ఆంక్షలతో విసుగెత్తుతున్న భారతీయులు

### చదువుల కోసం వెళ్లేవారి సంఖ్య గణనీయంగా తగ్గుదల

వాషింగ్టన్: ట్రంప్ తీరుతో అమెరికాలో ఉంటున్న భారతీయులకు, అమెరికా వెళ్లాలనుకుంటున్న విద్యార్థులకు సైతం విసుగు వస్తోంది. పదేపదే ఏదో ఒక ఆంక్ష కారణంగా అక్కడి విశ్వవిద్యాలయాలు కూడా ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. భారతీయ విద్యార్థుల రాక తగ్గిందని అక్కడి సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. దీంతో ఆ దేశానికి వెళ్లాలనుకునే భారత విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. 'కామన్ యాప్' నివేదికల ప్రకారం.. 2024-25 విద్యా సంవత్సరంలో వివిధ అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో 3.63 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు చేరారు. ఇక 2025-26లో అమెరికా కళాశాలల్లో కోర్సులలో ప్రవేశం కోరే భారత విద్యార్థుల సంఖ్య 15శాతం పడిపోయింది. మరోవైపు 2026 సెమిస్టర్‌లో అమెరికా కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అంతర్జాతీయ విద్యార్థుల నమోదులో కూడా 1.1 లక్షల తగ్గుదల కనిపించింది. 2025-26లో ఈ సంఖ్య 11.69 లక్షలుగా అంచనా వేయగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 10.57 లక్షలకు చేరింది. కఠినమైన వీసా నిబంధనలు, చదువు పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలపై అనిశ్చితి, సోషల్ మీడియా వెట్టింగ్ వంటి అంశాలే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అయితే తాజా ఆంక్షల వార్తల కారణంగా అమెరికాలో ఉద్యోగం చేయాలన్న వారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. అలాగే అక్కడ చదువుకోవాలన్న ఆశను కూడా వదులుకుంటున్నారు. ఓపిటి నిబంధలను కఠినతరం చేయడం, వీసా ఫీజులు పెంచి నిబంధనలు మరింత క్లిష్టంగా మార్చడంతో భారతీయ విద్యార్థులు అమెరికావైపు చూసేందుకు ఇష్టపడడం లేదని సర్వేలు చెబుతున్నాయి. అమెరికా ఫస్ట్ నినాదంతో ట్రంప్ ఊగిపోతున్నాడు. అమెరికన్లకే శిక్షణ ఇవ్వాలని అక్కడి టెక్కీ సంస్థలపై ఒత్తిడి పెంచుతున్నారు. హెచ్-1బి వీసాల పై ట్రంప్ ప్రభుత్వం విధించిన కొత్త రుసుమును అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సమర్థించారు. కంపెనీలు విదేశీ ఉద్యోగులను తీసుకోకుండా.. అమెరికన్లను నియమించుకోవాలని సూచించారు. వారికి మెరుగైన శిక్షణ ఇవ్వాలన్నారు.

# ఇక పైలెట్లకూ డోపింగ్ టెస్ట్‌లు

### మాదక ద్రవ్యాలు వినియోగంచకుండా ఆంక్షలు

### టెస్ట్ వ్యవహారాలను పరిశీలిస్తున్న డిజిసి

### కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ,ఆగస్టు: ఇకపై ఏడాదికి ఒక్కసారైనా విమాన పైలట్లకు డోప్ టెస్టులునిర్వహించాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. పైలట్లు మాదకద్రవ్యాల, మత్తు పదార్థాలు ఉపయోగించకుండా అరికట్టేందుకు, భవిష్యత్తులో కఠినమైన నిబంధనలు తెచ్చేందుకు డీజీసీఏ ప్రస్తుతం విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతోందని చెప్పు కొచ్చారు. ప్రస్తుతం మొత్తం పైలట్ల సంఖ్యలో 10 శాతం మందికి మాత్రమే డోప్ టెస్టులు నిర్వహించాలనే నిబంధన అమల్లో ఉందని చెప్పారు. ఏడాదిలో ఒకసారి ప్రతి పైలట్‌కూ పరీక్ష నిర్వహించేలా దీనిని మార్పు చేయాలనే అంశాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పరిశీలిస్తోందన్నారు. భద్రత, నిర్వహణ పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన ప్రస్తుత నిబంధనలను మరింత కఠినం చేసే మార్గాలపైనా డీజీసీఏ అధ్యయనం చేస్తోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా పుకెట్-ఢిల్లీ విమాన ఘటనపై మాట్లాడుతూ.. దీనిపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు చేస్తోందన్నారు. విమానంలోని పైలెట్ డేటా రికార్డర్ దర్యాప్తు సంస్థ ఆధీనంలో ఉందని పేర్కొన్నారు. త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. థాయ్‌లాండ్ నుంచి ఢిల్లీకి వస్తున్న విమానం ఆగస్టు 4న తీవ్ర కుదుపులకు లోనైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం పైలట్లు ఇద్దరికీ డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. తొలి పరీక్షలో పైలట్-ఇన్- కమాండ్‌కు పాజిటివ్ వచ్చింది. దీని తర్వాత సైకోయాక్టివ్ పరీక్ష నిర్వహించగా.. గంజాయి సేవించినట్లు నిర్ధరణ అయ్యింది. ఈ ఘటనపై ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు జరుపుతోందని పేర్కొన్నారు. విమానం డేటా రికార్డర్లు, ఇతర భాగాలు సురక్షితంగా ఉన్నందున, త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

# 'భూ' కబ్జా ఆరోపణలను ఖండించిన రైతు నిమ్మ రవీందర్ రెడ్డి...!






### బిఆధారాలు లేని ఆరోపణలు చేస్తే చట్టపరంగా చర్యలు - హెచ్చరించిన రవీందర్ రెడ్డి

### బితాత, ముత్తాతల నుండి 46 ఏళ్లుగా మాదే ఆస్తి... సర్వే అయ్యింది... ఓఆర్సీ ఉంది

### మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన రైతు నిమ్మ రవీందర్ రెడ్డి

### బికోర్టు ఉత్తర్వుల ప్రకారమే రోడ్డు చదును చేస్తున్నాం - రాజధాని డెవలపర్స్

మహేశ్వరం ప్రతినిధి, క్రైమ్ మిర్రర్: రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, కొంగర ఖుర్దు పరిధిలోని రాజధాని డెవలపర్స్ ఆధ్వర్యంలో 9 ఎకరాల్లో వెంచర్ ఏర్పాటు చేస్తుండగా కొంతమంది రైతులు భూ కబ్జా, నకిలీ పత్రాల ఆరోపణలతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం వెంచర్ డెవలపర్లు, భూ యజమానులు విలేకరుల సమావేశం నిర్వహించి వివరణ ఇచ్చారు.భూ యజమాని నిమ్మ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... ఈ ఆరోపణలన్నీ పూర్తిగా నిరాధారమని తెలిపారు. తాము 9 మంది అన్నదమ్ములమని, గత 46 ఏళ్లుగా ఈ భూమిలో వ్యవసాయం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇది తమ తాత, ముత్తాతల నుంచి సంక్రమించిన ఆస్తి అన్నారు. వెంచర్ నిర్వహిస్తున్న 9 ఎకరాల స్థలం 291, 292, 295 సర్వే నంబర్లకు చెందినదని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సర్వే నంబర్లకు తమ భూమికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ ఏడీ అధికారి సమక్షంలో చుట్టుపక్కల రైతులకు నోటీసులు ఇచ్చి సర్వే కూడా పూర్తయిందన్నారు.తమ భూమికి ఆనుకుని అటవీ శాఖ భూమి ఉండటంతో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నుంచి ఓఆర్సీ కూడా తీసుకున్నామని చెప్పారు. తమపై నిరాధార ఆరోపణలు చేసిన వారిపై కోర్టు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు, పెద్ద నాయకుల పేర్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

**రాజధాని డెవలపర్స్ మేనేజర్ కిరణ్ రెడ్డి మాట్లాడుతూ...**

వెంచర్‌కు సంబంధించి మాస్టర్ ప్లాన్‌లో ఉన్న 100 అడుగుల రోడ్డును చదును చేస్తున్నామని తెలిపారు. ఎదురుగా పెద్ద గుట్ట ఉండటంతో 289 సర్వే నంబర్ గల ప్రభుత్వ భూమి నుంచి రోడ్డు వేసుకునేందుకు కోర్టును ఆశ్రయించామని, కోర్టు అనుమతుల మేరకే పనులు చేస్తున్నామని వివరించారు. ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు భూమి అయిన 471 సర్వే నంబర్ వద్ద కొద్దిగా వివాదం ఉందని, అక్కడ కొందరు కబ్జా చేసి కంచె వేశారని ఆయన తెలిపారు. ఒకరిపై ఆరోపణలు చేసే ముందు నిజా నిజాలు తెలుసుకొని మాట్లాడాలని మండిపడ్డారు.


# ఇద్దరు చిన్నారుల అదృశ్యం కలకలం

### ఘట్కేసర్‌లో నిందితుడిని పట్టుకున్న పోలీసులు

హైదరాబాద్: నగరంలోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు చిన్నారుల అదృశ్యం తీవ్ర కలకలం రేపింది. అయితే గంటల వ్యవధిలోనే చిన్నారుల మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించడంతో కథ సుఖాంతమైంది. గచ్చిబౌలిలోని రాఘవ ప్రాజెక్ట్ లేబర్ క్యాంప్ నుంచి ప్రమీలా ముర్ము (4), సంగీత (3) అనే ఇద్దరు చిన్నారులు కనిపించకుండా పోయారు. సహోద్యోగి చాకు సోరెన్.. చిన్నారులను దుకాణానికి తీసుకెళ్తానని చెప్పి తీసుకెళ్లాడు. అయితే ఎంతసేపటికీ వారు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినప్పటికీ పిల్లల ఆచూకీ లభించలేదు. అర్ధరాత్రి అయినా చిన్నారులతో పాటు చాకు సోరెన్ కూడా తిరిగి రాకపోవడంతో సోమవారంరాత్రి ఒంటి గంట ప్రాంతంలో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని ఘట్కేసర్ రైల్వే స్టేషన్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆపై చిన్నారులను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. గంటల వ్యవధిలోనే పిల్లల ఆచూకీ లభించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ.. పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

# కృష్ణా నది చెంతనే ఉన్నా.. గుక్కెడు నీటికి కష్టాలు...!

- నీటిపారుదల శాఖ మంత్రి ప్రాంతంలోని నీటి సమస్య
- పాలకీడు మండలంలోని పలు గ్రామాల్లో తీవ్ర తాగునీటి సమస్య
- కృష్ణా నది నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్
- నీటి సమస్య పై తాత్కాలిక చర్యలు కాదు... శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి
- జాన్ పహాడ్ దర్గా గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ రాజు రాథోడ్




**క్రైమ్ మిర్రర్ , పాలకీడు :** కృష్ణా నది కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ పాలకీడు మండలంలోని పలు గ్రామాల ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. జాన్‌పహాడ్ దర్గా, జాన్‌పాడు, చెరువు తండా, గుండ్లపాడు, కోమటికుంట, హనుమయ్యగూడెం తదితర గ్రామపంచాయతీల పరిధిలో కరువు కాలం , వేసవి కాలంలో నీటి సమస్య మరింత తీవ్రరూపం దాల్చుతోంది. అనేక కుటుంబాలు తాగునీటి కోసం, కనీస అవసరాలకు ట్యాంకర్ల ద్వారా లేదా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నప్పటికీ శాశ్వత పరిష్కారం మాత్రం లభించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు, చేతిపంపులు, స్థానిక నీటి వనరులపై ఆధారపడుతున్న ప్రజలకు ఎల్ నినో ప్రభావం వలన భూగర్భజలాలు తగ్గిపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది.

**నది పక్కనే ఉన్నా.. నీరు ఎందుకు లేదు..?**

కృష్ణా నది సమీపంలో ఉన్న గ్రామాలకు పైప్‌లైన్ ద్వారా నీటిని తీసుకువచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఇప్పటివరకు శాశ్వత తాగునీటి వ్యవస్థ ఏర్పాటు కాలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు నది నీరు అందుబాటులో ఉండగా, మరోవైపు ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం ఇబ్బందులు పడటం అధికారుల దృష్టిని ఆకర్షించాల్సిన అంశమని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

**ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలి..?**

గత రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు మారినా గ్రామాల తాగునీటి సమస్య మాత్రం కొనసాగుతోందని ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఉండటం బాధాకరమని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇది కేవలం వేసవికాలపు, కరువుకాలపు సమస్యగా కాకుండా శాశ్వత తాగునీటి సమస్యగా గుర్తించి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**కృష్ణా నది నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి..జాన్ పహాడ్ దర్గా ఉపసర్పంచ్ రాజు రాథోడ్**

జాన్‌పహాడ్ దర్గా, జాన్‌పాడు, చెరువు తండా, గుండ్లపాడు, కోమటికుంట, హనుమయ్యగూడెం తదితర గ్రామాలను కలుపుతూ కృష్ణా నది నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి శుద్ధి చేసిన తాగునీటిని ప్రతి గ్రామానికి అందించాలని జాన్ పహాడ్ దర్గా గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ రాజు రాథోడ్ డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా అవసరమైన చోట్ల నీటి నిల్వ ట్యాంకులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, పంపింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ నిరంతర తాగునీటి సరఫరా అందించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

**జిల్లా అధికారులు వెంటనే సర్వే చేయాలి..!**

జిల్లా కలెక్టర్, గ్రామీణ నీటి సరఫరా అధికారులు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ఈ గ్రామాల్లో తక్షణమే క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి నీటి అవసరాలను అంచనా వేయాలని ప్రజలు కోరుతున్నారు. కృష్ణా నది నుంచి నీటిని తీసుకురావడానికి అవసరమైన సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించి, అంచనాలు రూపొందించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**మంత్రి చొరవ తీసుకొని సమస్య పరిస్కరించాలి... ప్రజలు**

కృష్ణా నది మా కళ్ల ముందే ప్రవహిస్తున్నా.. మా గ్రామాల్లో తాగడానికి చుక్క నీరు లేకపోవడం ఇకనైనా ముగియాలి. తాత్కాలిక నీటి సరఫరా కాకుండా కృష్ణా నది నుంచి శాశ్వత పైప్‌లైన్ ఏర్పాటు చేసి మా గ్రామాల తాగునీటి సమస్యను పరిష్కరించాలి అని గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ప్రజల తాగునీటి హక్కును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి శాశ్వత తాగునీటి ప్రాజెక్టును మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



జాన్ పహాడ్ దర్గా గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ రాజు రాథోడ్

# జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో ఆరోగ్య లక్ష్మి కమిటీ ఏర్పాటు...!



**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో గల అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ జ్యోతి సమక్షంలో ఆరోగ్య లక్ష్మి కమిటీ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో ముఖ్య అతిథిగా హాజరై కమిటీ వివరాలను వెల్లడించారు.కమిటీలో మొత్తం 11 మంది సభ్యులను ఎంపిక చేశారు. వార్డు కౌన్సిలర్ క్యాదసు నవీన్ కుమార్ చైర్మన్‌గా, అంగన్వాడీ టీచర్ కన్వీనర్‌గా వ్యవహరించనుండగా, మిగతా తొమ్మిది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

**కమిటీ బాధ్యతలు & లక్ష్యాలు:** అంగన్వాడీ కేంద్రంలో ప్రతి నెలా 1వ తేదీన తల్లుల సమావేశం ఏర్పాటు చేసి, ఐసీడీఎస్ (×జణూ) కార్యక్రమాలన్నింటి గురించి వార్డు ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలి. 3 నుండి 6 సంవత్సరాల పిల్లలందరినీ కేంద్రానికి పంపడంలోనూ, పిల్లల ఎత్తు, బరువు సక్రమంగా తీయడంలోనూ సహకరించాలి.ప్రతిరోజూ గర్భిణులు, బాలింతలను కేంద్రానికి పంపించి పౌష్టికాహారం (భోజనం) తీసుకునేలా అవగాహన కల్పించాలి.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మమత, వార్డు పెద్దలు క్యాదాసు నాగయ్య, ఏఎన్ఎం పద్మ, ఆశా వర్కర్ వసంత, ఆర్పీలు సింధూజ, రజిత, అంగన్వాడీ టీచర్ జ్యోతి, ఆయా భాగ్యతో పాటు గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు మరియు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# మలక్ పేట యశోదా హాస్పిటల్ లో ఆర్థోస్కోపిక్ రొటేటర్ కఫ్ రిపేర్ సర్ అక్రోమియల్ డీకంప్రెషన్ విజయవంతం




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం యశోద మెడికల్ సెంటర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ మలక్ పేట యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ స్పోర్ట్స్ ఇంజ్యూరీస్ ఆర్థోస్కోపీ సర్జన్ డాక్టర్ కృష్ణ సుబ్రహ్మణ్యం డాక్టర్ ఈ నరేష్ మాట్లాడుతూ భుజంలో నొప్పి వస్తే వయసు ప్రభావమో ఎక్కువగా పనిచేయడం వల్లనో లేదా సాధారణ కండరాల నొప్పిగానో భావించి చాలామంది నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే నొప్పి తగ్గకుండా కొనసాగుతూ చెయ్యి పైకి ఎత్తడం లేదా కదిలించడం కష్టంగా మారితే అది రొటేటర్ కఫ్ టియర్ కావచ్చు. భుజం కీలును స్థిరంగా ఉంచడంతో పాటు చెయ్యి కదలికలకు సహాయపడే టెండన్లు చీలిపోవడాన్ని రొటేటర్ కఫ్ టియర్ అంటారు. దీనికి సకాలంలో చికిత్స అందించకపోతే చీలిక మరింత పెరిగి నొప్పి బలహీనత భుజం కదలికలు తగ్గిపోవడంతో పాటు రోజువారీ పనులు చేసుకోవడం కూడా కష్టంగా మారవచ్చు. సకాలంలో ఆర్థోపెడిక్ నిపుణులను సంప్రదించి అత్యాదునిక ఆర్థోస్కోపిక్ చికిత్స తీసుకోవడం ద్వారా దెబ్బతిన్న టెండన్ను సరిచేసి భుజం పనితీరును పునరుద్ధరించవచ్చు. ఇటువంటి సమస్యతో బాధపడుతున్న ఖమ్మంకు చెందిన 57 ఏళ్ల పులిచింతల బాశమ్మకు మలక్ పేట యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్యబృందం విజయవంతంగా చికిత్స అందించింది. ఆమె కొంతకాలంగా కుడి భుజంలో నిరంతర నొప్పితో పాటు చెయ్యి కదలికలు తగ్గిపోవడంతో బాధపడుతున్నారు. సమగ్ర వైద్య పరీక్షలు అవసరమైన పరిశోధనల అనంతరం ఆమె కుడి భుజంలో రొటేటర్ ఆఫ్ టియర్ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. టెండన్ చీలిక స్వభావంతో పాటు భుజం కదలికలు పరిమితం కావడాన్ని పరిగణనలోకి తీసుకుని దెబ్బతిన్న రొటేటర్ కప్పు సరిచేసి భుజం కదలికలను మెరుగుపరిచేందుకు అత్యాధునిక ఆర్థోస్కోపిక్ రిపేర్ చేయాలని వైద్యబృందం నిర్ణయించింది. రొటేటర్ కఫ్ రిపేర్ తర్వాత విజయవంతంగా కోలుకోవడం. ప్రణాళికాబద్ధమైన పునరావాసం కూడా అంతే కీలకం.ప్రారంభ దశలో భుజాన్ని తగిన విధంగా స్థిరంగా ఉంచడం ఆ తర్వాత నిపుణుల పర్యవేక్షణలో క్రమంగా కదలికల వ్యాయామాలు ఫిజియోథెరపీ చేయడం ద్వారా భుజం కదలికలు పనితీరును తిరిగి పొందవచ్చు అని అన్నారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ సందీప్ నాగార్జున జాన్ బాబు అసిస్టెంట్ మేనేజర్ రాజేష్ యశోద మెడికల్ సెంటర్ మరియు పేషెంట్ భాషమ్మ పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ ఇష్యూస్ మరియు ఫీచర్ రైటింగ్‌లో అనుభవం ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం ఉండాలి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్స్ (న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595




# యూత్ కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుభాన్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళనలపై పోలీసుల అణచివేత, పెల్లెట్ గన్ల వాడకం పరిణామాలకు నిరసనగా హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శులు ఏనుగు జంగారెడ్డి రంగారెడ్డి, షాద్ నగర్ వైస్ చైర్మన్ అందె మోహన్, జిల్లా ఇన్‌చార్జ్ సంతోష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు దాయ సాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని మృతి



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలంలోని వట్టిమర్తి రెవెన్యూ పరిధిలో, ఎం.పి.ఎల్. కంపెనీ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద వేప చెట్టుకు ఓ గుర్తుతెలియని వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. గొర్రెల కాపరుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉంది.మృతుడి ఒంటిపై గోధుమ రంగు ఫుల్‌హ్యాండ్ షర్ట్, సిమెంట్ రంగు ప్యాంట్ ఉన్నాయి. అతని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు, ఆధారాలు లభించలేదు.మృతుడి ఆచూకీ లేదా వివరాలు తెలిసిన వారు చిట్యాల పోలీస్ స్టేషన్కు లేదా కింది ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.చిట్యాల ఎస్ఐ: 8712670187 నార్కట్‌పల్లి సీఐ: 8712670148 చిట్యాల పోలీస్ స్టేషన్: 8712667731 పై నెంబర్లకు సమాచారం ఇవ్వగలరు

# వెలిమినేడులో ఘనంగా వన మహోత్సవం



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటి వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ కార్యదర్శి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంతటి స్వప్న సత్య గౌడ్, పాలకవర్గ సభ్యులు మహంకాళి లింగస్వామి, దేశబోయిన మంజుల మల్లేష్ యాదవ్, చింతకింది వెంకటేశం, వరికుప్పల సంగీత సుధాకర్, గ్రామ కార్యదర్శి తాటికొండ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికి ఘనంగా వీడ్కోలు...!

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** జిల్లా కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ గా విధులు నిర్వహించి సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది బదిలీపై లావణ్య గారికి జగిత్యాల బార్ అసోసియేషన్ ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి శ్రీమతి రత్నా పద్మావతి గారు మాట్లాడుతూ అనతి కాలంలోనే వెయ్యికి పైగా కేసులు పరిష్కరించి కక్షిదారులకు న్యాయం అందించారని ఉద్యోగం అన్నపుడు బదిలీలు తప్పవని పదోన్నతి పొందడం సంతోషంగా ఉందని బదిలీపై వెళ్లడం బాధగా ఉందన్నారు.ఈసందర్భంగా న్యాయవాదులు అందరు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్ రావు,సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ నిఖిషా గారు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్ర నర్సయ్య ఉపాధ్యక్షులు మర్రిపెల్లి సత్యప్రకాశ్ ప్రధాన కార్యదర్శి అందె మారుతి న్యాయవాదులు రాచకొండ శ్రీరాములు,బండ భాస్కర్ రెడ్డి,డబ్బు లక్ష్మారెడ్డి,ముదిగంటి జనార్దన్ రెడ్డి,వెంకటేశ్వర్ రావు,సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు..



# విద్య, వైద్యానికి ప్రభుత్వ ప్రాధాన్యత..

. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలపాలి

ప్రజాహితం కోసం విద్య, వైద్యానికి పెట్టే ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడి

ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ ను ప్రారంభించిన మంత్రి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** విద్య, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం మంత్రి, స్థానిక జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రూ. 2375 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజాహితం కోసం విద్య, వైద్యం పై పెట్టే ఖర్చు, భవిష్యత్తు పెట్టుబడి అన్నారు. జిల్లాలో వైద్య కళాశాల పూర్తయ్యే నాటికి మనకు ఇంకొక 200 పడకల ఆసుపత్రి కావాలని, అది ఎక్కడ కట్టాలని స్థల నిర్ధారణ చేస్తే, ముఖ్యమంత్రిని అడిగి దాన్ని కూడా మంజూరు చేయిస్తానని తెలిపారు. ఓల్డ్ బిల్డింగ్ శిథిలావస్థలో వుందని, పరిశీలించి, దాన్ని తొలగించడానికి ప్రతిపాదనలు ఇస్తే, మొత్తం స్థలాన్ని ప్రణాళికాబద్ధంగా వినియోగంలోకి తెస్తామన్నారు. ఎక్కువ స్థలం ఇంకా మిగిలిపోయింది దాన్ని ఏ రకంగా వాడుకుంటాం ఈ యొక్క హాస్పిటల్ కి సంబంధించినటువంటి వచ్చే బాధితులు, సహాయకులు సౌకర్యవంతంగా వుండేలా చర్యలు చేపట్టాలన్నారు. పార్కింగ్ ఎక్కడ ఉంటే బాగుంటది, బిల్డింగ్స్ మీద సోలార్ కి వెళ్తే మీ పవర్ ఖర్చులు కూడా లేకుండా చూసుకోవచ్చన్నారు. రోగులకి సకల సౌకర్యాలు ఉండాలని, హైదరాబాదులా ఖమ్మం హాస్పిటల్లో అన్ని సౌకర్యాలు దొరుకుతాయి అనే విశ్వాసాన్ని నమ్మకాన్ని ఖమ్మం జిల్లా ప్రజలకే కాకుండా చుట్టుపక్కల జిల్లా ప్రజలకి కల్పించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా అని రంగాలలో అగ్ర భాగాన ఉండాలని మంత్రి అన్నారు. రహదారులు, మునిసిపాలిటీ కార్పొరేషన్, హాస్పిటల్స్, విద్యాలయాలు, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, ప్రభుత్వం ఆస్తులు అన్ని తీర్చిదిద్దాలని, అవి వేరే జిల్లా వాళ్ళకి ఆదర్శంగా వుండాలని తెలిపారు. మనం కష్టపడితే ఫలితాలు వస్తాయని, ఆ ఫలితాలు రాష్ట్రం మొత్తానికి వ్యాపిస్తాయని అన్నారు. పట్టణ రహదారులు కూడా అందరిని సమన్వయం చేసుకొని చక్కగా అవుతున్నాయన్నారు. ప్రజల యొక్క అభీష్టం మేరకు వాళ్ళ అవసరాలకు తగ్గట్టుగా కార్పొరేషన్ అభివృద్ధి జరగాలన్నారు. జిల్లా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ కాకుండానే, ఇంకా అవసరమైనటువంటి అన్ని కార్యక్రమాల్ని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్నటువంటి వైద్య సౌకర్యాలు మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకెళ్లగలుగుతానే విశ్వాసంతోటి విద్య, వైద్యం పై చేసే ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడని, ఈ పిల్లలు రేపు ఈ రాష్ట్రానికే కాదు ఈ దేశానికి మనకి ఒక ఆస్తి అని తెలిపారు . డాక్టర్స్ కావచ్చు, ఇంజనీర్స్ కావచ్చు, చదువుకున్నటువంటి ప్రతి బిడ్డ కూడా ఈ దేశం ఆస్తి అందుకనే మనం ఆస్తి మీద పెట్టుబడి పెట్టి ఆస్తిని మనం జాగ్రత్త చేసుకుంటే ఆస్తి ద్వారా ఈ రాష్ట్రం ఈ దేశం సుఖంగా సౌభాగ్యంగా ఉండే అవకాశం ఉంటదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల పటిష్టానికి చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రి లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ దుర్గా ప్రసాద్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. శంకర్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




## ముస్లిం సోదరీ సోదరులకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపిన చింతకాని ఎస్సై నరేష్

మతసామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలి

ర్యాలీలు, ఊరేగింపుల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వొద్దు

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** మిలాద్-ఉన్-నబీ పండుగ సందర్భంగా చింతకాని మండల ముస్లిం సోదరీ సోదరులకు ఎస్సై నరేష్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ వేడుకలను మతసామరస్యానికి ప్రతీకగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ముస్లిం కుల, మత పెద్దలు, మైనారిటీ నాయకులతో ఎస్సై నరేష్ సమావేశమై పండుగ సందర్భంగా నిర్వహించనున్న ర్యాలీలు, ఊరేగింపు కార్యక్రమాలపై చర్చించారు. పండుగ వేడుకల్లో ప్రతి ఒక్కరూ సంయమనం పాటిస్తూ, ఎలాంటి వివాదాలు, ఘర్షణలు లేదా అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ర్యాలీలు, ఊరేగింపులు ప్రశాంతంగా జరిగేలా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పోలీసు శాఖకు సహకరించాలని ఎస్సై నరేష్ కోరారు. ఇతర మతాల మనోభావాలను గౌరవిస్తూ పరస్పర సోదరభావం, మతసామరస్యాన్ని కాపాడాలని తెలిపారు. చింతకాని మండలంలో మిలాద్-ఉన్-నబీ వేడుకలు శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ పాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఖాసీం, సీనియర్ జర్నలిస్ట్ పాషా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలతో పచ్చదనం




**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఆగస్టు 25:** మిర్యాలగూడ మండలంలోని కాల్వపల్లి, కాల్వపల్లి తండా, తడకమళ్ల గ్రామాల్లో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎం.శేషగిరిశర్మ, డీఎల్‌పీఓ రాఘవరావు, ఎంపీఓ మాతంగి రమేష్ మొక్కలు నాటారు.కాల్వపల్లి తండాలో నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఈసీ ఎం.కళావతి, సర్పంచ్ దీరావత్ అంజలి, లింగనాయక్, పంచాయతీ కార్యదర్శి సైదులు, నునావత్ కోటయ్య, సీనియర్ మేట్ దీరావత్ వనిత, ఫీల్డ్ అసిస్టెంట్ షాహిన్ సుల్తానా పాల్గొన్నారు.కాల్వపల్లి గ్రామపంచాయతీలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జక్కల రమణమ్మ, ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి అనంత శివ, చిన్నబోయిన వీరయ్య, టీపీ లాలు, ఉపసర్పంచ్ గోవింద, చిట్టెమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ షాహిన్ సుల్తానా పాల్గొన్నారు.తక్కలపాడు గ్రామంలో తడకమళ్ల రహదారి వెంట అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.శేషగిరిశర్మ, డీఎల్‌పీఓ రాఘవరావు, ఎంపీఓ మాతంగి రమేష్, ఉపాధి హామీ పథకం ఈసీ కళావతి, సర్పంచులు చిటికల సుజాత--జానయ్య, ఉపసర్పంచ్ మైనం మురళి, గుండు నరేందర్, వార్డు సభ్యుడు దొంతగాని బిక్షం, పంచాయతీ కార్యదర్శి కోడిరెక్క శైలజ, గ్రామస్థులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలి: బొల్లం మల్లయ్య యాదవ్

రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలం

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి రాజీనామా చేయాలి

మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



**కోదాడ ఆగస్టు 25 ( క్రైమ్ మిర్రర్):** కోదాడ: నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయడంతో పాటు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కోదాడ పట్టణంలోని నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఇరిగేషన్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ, రైతులకు సాగునీరు అందించలేని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ జలాశయంలో నీటి లభ్యత ఉన్నప్పటికీ ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.

పోతిరెడ్డిపాడు నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు నీటిని తరలిస్తున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం మౌనం వహిస్తోందని ఆయన విమర్శించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల్లో తెలంగాణకు ఉన్న నీటి హక్కుల విషయంలో ప్రభుత్వం తగిన విధంగా వ్యవహరించడం లేదని ఆరోపించారు. గతంలో సాగర్ నుంచి విడుదల చేసిన నీటిని ఖమ్మం జిల్లా వైపు మళ్లించడం వల్ల నల్లగొండ జిల్లా ఆయకట్టు రైతులకు నష్టం జరిగిందని అన్నారు.

**"డెడ్ స్టోరేజ్‌లోనూ రైతులకు నీళ్లు ఇచ్చాం"**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డెడ్ స్టోరేజ్ స్థాయిలో ఉన్న సమయంలో కూడా రైతులకు సాగునీరు అందించి నీటి ఎద్దడి లేకుండా చూసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మల్లయ్య యాదవ్ పేర్కొన్నారు.ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బోర్లు, బావుల్లో నీటి మట్టాలు తగ్గిపోవడంతో పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. నల్లగొండ జిల్లా ఆయకట్టు మీదుగా ఇతర ప్రాంతాలకు నీటిని తరలిస్తూ స్థానిక రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

**SLBC పనులపై కూడా విమర్శలు**

శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) పనుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. పనుల సమయంలో జరిగిన ప్రమాదంలో కార్మికులు మృతి చెందడం బాధాకరమని, వారి విషయంలో ప్రభుత్వం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. అలాగే కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల మరమ్మతుల విషయంలో కూడా ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నీటి వనరుల నిర్వహణపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

**సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలి**

నాగార్జునసాగర్ నుంచి కోదాడ నియోజకవర్గంలోని ఆయకట్టు ప్రాంతాలకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని, తాగునీటి అవసరాలను కూడా తీర్చాలని బొల్లం మల్లయ్య యాదవ్ ఇరిగేషన్ అధికారులను కోరారు. రైతుల పంటలను కాపాడేందుకు, భూగర్భ జలాలను పెంచేందుకు చెరువులు, కాలువలకు నీటిని అందించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి రైతాంగ సమస్యలను పరిష్కరించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి



రామచంద్ర రావు దీక్షకు బిజెపి నాయకులు మద్దతుగా దీక్ష

**కోదాడ ఆగస్టు 25 క్రైమ్ మిర్రర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దించే దాకా పోరాటాలు నిర్వహిస్తామని కోదాడ బిజెపి నాయకులు పేర్కొన్నారు తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు చేపట్టిన దీక్షకు కోదాడ బిజెపి నాయకులు మద్దతుగా దీక్ష కార్యక్రమాన్ని పట్టణంలోని స్థానిక రంగా థియేటర్ వద్ద చేపట్టారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివిధ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 15000 కోట్ల రూపాయల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ప్రభుత్వం గద్దె దిగేదాకా బిజెపి శ్రేణులు పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించాడు ఈ సందర్భంగా వివిధ కళాశాలలకు చెందిన వందలాదిమంది విద్యార్థులు దీక్షా శిబిరానికి చేరుకొని బిజెపి నాయకులకు సంఘీభావం మద్దతు తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వంగవీటి శ్రీనివాసరావు, నారాయణ, బోలిశెట్టి కృష్ణయ్య మహేష్, పుల్లారావు, బసవయ్య, పురుషోత్తం,, ప్రవీణ్, గణేష్, కళావతి, సీత జనార్దన్,ఈశ్వరరావు, ఎమ్మెస్ కళాశాల సీఈవో ఎస్ఎస్ రావు కళాశాల విద్యార్థులు,బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## స్థానిక సమస్యల పరిష్కారానికి ఈనెల 31న జరిగే కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి

సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్





**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించి, ఆ వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న జరిగే కలెక్టరేట్ ముందు ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ పిలుపునిచ్చారు...స్థానిక సత్యనారాయణపురం, చిన్న తండా కాలేసే తండా గ్రామాల్లో ఉన్న ప్రైమరీ స్కూల్స్, అంగన్వాడి సెంటర్స్, మరియు రేషన్ షాపులు, కస్తూరిబా స్కూల్స్ ను సందర్శించి సర్వే నిర్వహించారు. ఈ సర్వే సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ రెండు అంగన్వాడి సెంటర్లకు పక్కా బిల్డింగులు లేవని వాటిని ఏర్పాటు చేయాలని అనే సందర్భంగా అన్నారు. చిన్నతండ గ్రామంలో ఉన్న స్కూల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని ఆయన తెలియజేశారు. సత్యనారాయణపురం ప్రైమరీ స్కూల్లో అదనపు గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. స్కూల్లో ఫర్నిచర్ లేదని సర్వేలో వెళ్ళేటట్టు ఆయన తెలియజేశారు. కస్తూరిబా స్కూల్లో వంటశాల సరిగా లేదని ఆయన తెలియజేశారు. ఇంకా అనేక సమస్యలు ఈ సర్వేలో వెల్లడానికి అందుబాటులో ఉన్న అధికారులతో ఫోన్లో మాట్లాడినటువంటి చేశారు. దీని సమస్యల పరిష్కారానికి ఈనెల 31 నుండి జరిగే కలెక్టరేట్ ముందు ధర్నా సందర్భంగా కలెక్టర్ గారికి వినతిపత్రం అందజేయనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ సర్వే కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తోట పెద్ద వెంకటరెడ్డి, తోట నరేష్ రెడ్డి, గుమ్మడి నరసయ్య, గంగాధర్, హరి, వెంకటేశ్వర్లు రామారావు, ప్రదీప్, సందీప్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యాలయం మండల కేంద్రంలో.. అధికారులు మాత్రం ఇతర ప్రాంతాల్లో!

మండల కేంద్రంలో లక్షల రూపాయలు వెచ్చించి నూతన కార్యాలయం నిర్మిస్తే సరిపోతుందా?

హెచ్ఆర్ఏ తీసుకోవడం మాత్రమే ప్రభుత్వ నిబంధనలను పాటించడం అవుతుందా? లేక ప్రజలకు స్థానికంగా అందుబాటులో ఉండటమూ బాధ్యతేనా?

మండల కేంద్రంలో నివాసం ఉండకుండా ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుంటే ప్రభుత్వం నుంచి 17 శాతం హెచ్ఆర్ఏ ఎందుకు పొందుతున్నారు?

స్థానికంగా నివాసం లేకుండా ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు ఎలాంటి పర్యవేక్షణ చేస్తున్నారు?

**కమాన్‌పూర్,ఆగస్టు 25:** మండల కేంద్రంలో నూతన తహశీల్దార్ కార్యాలయం అందుబాటులోకి వచ్చినా.. రెవెన్యూ అధికారులు మాత్రం స్థానికంగా నివాసం ఉండక ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారన్న అంశం మండల ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాల్సిన రెవెన్యూ అధికారులు మండల కేంద్రంలోనే నివాసం ఉండాలనే నిబంధనలున్నప్పటికీ వాటి అమలు ఏ మేరకు జరుగుతోందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు అద్దె భవనాల్లో కొనసాగిన మండల రెవెన్యూ కార్యాలయానికి ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి నూతన భవనం నిర్మించింది. సోమవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నూతన తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీంతో సోమవారం నుంచి నూతన భవనం నుంచే రెవెన్యూ శాఖ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. అయితే కార్యాలయానికి నూతన భవనం సమకూరినా.. ప్రజలకు అవసరమైన సమయంలో అధికారులు స్థానికంగా అందుబాటులో ఉంటారా? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వహించే ప్రాంతంలో నివాసం ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం హెచ్ఆర్ఏ వంటి సౌకర్యాలను కల్పిస్తోంది. అయితే మండల కేంద్రంలో నివాసం



ఉండకుండా ఇతర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తూ 17 శాతం హెచ్ఆర్ఏ పొందుతున్నట్లయితే, ఆ భత్యం ఏ ప్రాతిపదికన చెల్లిస్తున్నారన్న ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి. సంబంధిత అధికారులు వాస్తవంగా ఎక్కడ నివాసం ఉంటున్నారు? వారికి హెచ్ఆర్ఏ ఎలా మంజూరవుతోంది? అనే అంశాలపై ఉన్నతాధికారులు పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు ఎప్పుడు తలెత్తుతాయో చెప్పలేని పరిస్థితి. భూ వివాదాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రకృతి వైపరీత్యాలు, పంట నష్టం, ధ్రువీకరణ పత్రాలు తదితర అంశాల్లో అధికారుల తక్షణ స్పందన అవసరమవుతుంది. అలాంటి అత్యవసర సమయంలో మండల కేంద్రంలో అధికారి అందుబాటులో లేకపోతే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలన్న ప్రశ్న తలెత్తుతోంది. కనీస సమాచారం కోసం కూడా అధికారులు అందుబాటులో లేకపోతే నూతన కార్యాలయం నిర్మాణం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనం ఎంత అన్నదీ చర్చనీయాంశంగా మారింది. మండల కేంద్రంలో లక్షల రూపాయలు వెచ్చించి నూతన కార్యాలయం నిర్మిస్తే సరిపోతుందా? కార్యాలయంతోపాటు అధికారులు కూడా ప్రజలకు స్థానికంగా అందుబాటులో ఉండాల్సిన అవసరం లేదా? హెచ్ఆర్ఏ తీసుకోవడం మాత్రమే ప్రభుత్వ నిబంధనలను పాటించడం అవుతుందా? లేక ప్రజలకు అందుబాటులో ఉండటమూ ఉద్యోగ బాధ్యతలో భాగమేనా? స్థానికంగా నివాసం లేకుండా రాకపోకలు సాగిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు ఎలాంటి పర్యవేక్షణ చేస్తున్నారు? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. నూతన కార్యాలయ భవనం ప్రారంభంతో రెవెన్యూ పాలన మరింత ప్రజలకు చేరువ కావాలని, అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. భవనం మారింది.. ఇక అధికారుల పనితీరులో, ప్రజలకు అందుబాటులో ఉండటంలోనూ మార్పు రావాల్సిందే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



## నాగారంలో 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**క్రైమ్ మిర్రర్ పెద్దపెల్లి జిల్లా ఆగస్టు 25:** కమాన్‌పూర్ మండల పరిధిలోని నాగారం గ్రామంలో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కమాన్‌పూర్ ఎస్ఐ కొట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో సుమారు 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాణాపూర్‌కు చెందిన మునిగల తిరుపతి వద్ద బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని తదుపరి చర్యల నిమిత్తం రెవెన్యూ శాఖ అధికారులకు అప్పగించారు. ఈ వ్యవహారంపై మునిగల తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమ నిల్వ, రవాణాపై నిఘా కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ కొట్టే ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, తరలించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## బీసీ మహిళలకు వంద శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు

### ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం.. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లాలో బీసీ మహిళలను ఆర్థికంగా స్వావలంబన కలిగిన మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బీసీ సంక్షేమశాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం




ఖమ్మం జిల్లాలో ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ పథకం క్రింద జిల్లాలోని ప్రతి శాసనసభ నియోజక వర్గానికి 1,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లు చొప్పున, ఒక్కో యూనిట్ విలువ 12 వేలు 100 శాతం ఉచిత సబ్సిడీపై అర్హులైన బీసీ మహిళలకు అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళలు బీసీ వర్గానికి చెందిన నిరుద్యోగ మహిళలై ఉండాలని, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలు, అలాగే మేరా/మేరు (వీజు=ూా/వీజు=ఖ) కమ్యూనిటీకి చెందిన మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలకు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షలకు మించకూడదని, తెల్ల రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం క్రింద అవకాశం ఉంటుందని, కుట్టు వృత్తిలో నైపుణ్యం కలిగిన వారికి, అలాగే కనీస ప్రాథమిక అక్షరాస్యత ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హులైన బీసీ మహిళలు సెప్టెంబర్ 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఆన్‌లైన్ దరఖాస్తులను "స్త్రశీఎఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ పోర్టల్ ద్వారా సమర్పించాలని తెలిపారు.అర్హత కలిగిన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్దేశిత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.

## బండ్లగూడ రైల్వే భూముల నిర్వాసితులకు అండగా ఉంటాం

రైల్వే నోటీసులపై ఆందోళన వద్దు

అవసరమైతే పెద్ద ఎత్తున పోరాటం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి భరోసా

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 25:** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ రైల్వే స్థలాల్లో నివాసముంటున్న నిర్వాసితుల సమస్యపై ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, స్థానిక ప్రజాప్రతినిధిగా వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు.?సోమవారం సాయంత్రం మాజీ ఎంపిపి యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో బండ్లగూడ నిర్వాసితుల బృందం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. రైల్వే అధికారుల నుంచి వచ్చిన నోటీసులను వివరిస్తూ, తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ... గత 50 సంవత్సరాలుగా బండ్లగూ డలో గుడిసెలు, ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్న నిరుపేదలను రైల్వే భూముల పేరుతో ఉన్నపళంగా ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. దశాబ్దాలుగా అక్కడే జీవనం సాగిస్తున్న పేదలకు అన్యాయం జరగనివ్వబోమని తెలిపారు. ఈ అంశంపై తక్షణమే సంబంధిత రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, అవసరమైతే నిర్వాసితుల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నిర్వాసితులకు అన్ని విధాలా న్యాయం జరిగే వరకు పోరాడతామని ఆయన హామీ ఇచ్చారు.



## మహారాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యం లారీ పట్టివేత

- దౌల్తాబాద్ చౌరస్తా వద్ద పౌరసరఫరాల శాఖ అధికారుల దాడి
- రూ.9 లక్షల విలువైన 250 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం
- లారీ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు

**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 25:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ చౌరస్తా వద్ద మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. పటాన్‌చెరు మండలం పాశమైలారం నుంచి మహారాష్ట్రకు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. పౌరసరఫరాల శాఖ అధికారి డిటిటిఎస్ అనూప్ దేవానంద్, స్థానిక ఎస్సై శ్రీధర్‌రెడ్డితో కలిసి దౌల్తాబాద్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న రేషన్ బియ్యం లారీని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. లారీని క్షుణ్ణంగా తనిఖీ చేయగా భారీ మొత్తంలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు.

**250 క్వింటాళ్ల బియ్యం.. రూ.9 లక్షల విలువ**

అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం లారీలో సుమారు 250 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు.

**పాశమైలారం నుంచి మహారాష్ట్రకు..**

పటాన్‌చెరు మండలం పాశమైలారం ప్రాంతం నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. రేషన్ బియ్యం అక్రమ రవాణా వెనుక ఎవరెవరు ఉన్నారు? బియ్యం



ఎక్కడి నుంచి సేకరించారు? ఎక్కడికి తరలిస్తున్నారు? అనే కోణాల్లో అధికారులు విచారణ చేపట్టారు.

**డ్రైవర్, యజమానిపై కేసు నమోదు**

లారీని అదుపులోకి తీసుకున్న అధికారులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్‌తో పాటు వాహన యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అక్రమ రవాణా వ్యవహారంలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే విషయాన్ని కూడా విచారిస్తున్నట్లు సమాచారం.

**బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం**

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దౌల్తాబాద్ వద్ద పట్టుబడిన లారీ ఘటనతో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై మరోసారి చర్చ మొదలైంది.

## ఎంచుకున్న లక్ష్యాన్ని సంకల్పం, క్రమశిక్షణతో సాధించాలి :జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

ప్రతి రోజును కౌంట్‌డౌన్‌గా భావించి లక్ష్య సాధనకు క్రమశిక్షణతో కృషి చేయాలి : పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**ఎంచుకున్న లక్ష్యాన్ని దృఢ సంకల్పం, క్రమశిక్షణ,నిరంతర కృషితో సాధించుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.**

**పెద్దపల్లి జిల్లా క్రైమ్ మిర్రర్ ఆగస్టు 25 న్యూస్ :** మంగళవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో జిల్లా కలెక్టర్, రామగుండం పోలీస్ కమిషనర్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "నిపుణ" ఎస్.ఐ.,పి.సి.ఉచిత శిక్షణ కేంద్రాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,డిసిపి ఎ. భాస్కర్,బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల ఎసిపి. ప్రకాష్,ఆర్ఐ. సంపత్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వర్తించే పోలీసు శాఖలో ఎస్.ఐ,పి.సి. పోస్టుల కోసం అందిస్తున్న ఈ ఉచిత శిక్షణను అభ్యర్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఉత్తమ శిక్షకుల ద్వారా నాణ్యమైన శిక్షణ అందించడంతో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను కూడా అందిస్తున్నట్లు తెలిపారు.అభ్యర్థులు పూర్తి ఏకాగ్రతతో శిక్షణ పొంది,నిర్ణీత సమయంలో సిలబస్‌ను పూర్తి చేయాలని సూచించారు.పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్రతి సబ్జెక్టుపై పూర్తి అవగాహన,లోతైన పట్టు అవసరమని తెలిపారు.ప్రిలిమ్స్‌లో పదివేల మంది అభ్యర్థులు పోటీపడితే,తాము అత్యుత్తమంగా రాణించి ముందంజలో ఉండేలా సిద్ధం కావాలని, మెయిన్స్‌లో కూడా అత్యున్నత స్థాయిలో పోటీ పడే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు.అందుకు అనుగుణంగా స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని సన్నద్ధం కావాలని, క్రమం తప్పకుండా తరగతులకు హాజరై తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఉచితంగా నిర్వహించే శిక్షణ,పోటీ పరీక్షలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకుని తమ వ్యక్తిగత సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవాలని సూచించారు. సబ్జెక్టులోని ప్రతి అంశంపై పట్టు సాధిస్తూ,ముఖ్యమైన విషయాలను నోట్స్‌గా రాసుకోవాలని తెలిపారు.రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ,పరీక్ష వరకు మిగిలి ఉన్న ప్రతి రోజును కౌంట్‌డౌన్‌గా భావించి సద్వినియోగం చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు. సెలవులు,ఇతర కారణాలను పక్కనపెట్టి క్రమశిక్షణతో శిక్షణకు హాజరవుతూ తమ నైపుణ్యం, సామర్థ్యాన్ని నిరంతరం పెంచుకోవాలని తెలిపారు.విజయం సాధించాలంటే దైనందిన అలవాట్లలో మార్పు తీసుకురావాలని, శిక్షణ సమయంలో పూర్తి ఏకాగ్రతతో ఉండాలని అన్నారు. ప్రతిరోజూ కొత్త విషయాలను నేర్చుకుంటూ, నేర్చుకున్న అంశాలను పునరావృతం చేసుకోవాలని సూచించారు.ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు దృఢ సంకల్పంతో ముందడుగు



వేయాలని,ప్రతి పనిలో నైపుణ్యం సాధించాలని తెలిపారు.కేవలం ఉద్యోగం పొందడమే కాకుండా,ఉన్నత స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో కృషి చేయాలని అభ్యర్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,శిక్షకులు, పోటీపరీక్షల అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఈద్ మిలాద్ ఉన్ నబీ ర్యాలీలు శాంతియుతంగా నిర్వహించాలి

**ఫేక్ మెసేజ్‌లు నమ్మొద్దు, ప్రచారం చేస్తే కఠిన చర్యలు**

**ముస్లిం మత పెద్దలతో పీస్ మీటింగ్‌లో సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్**

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 25: ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే ర్యాలీలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో ప్రత్యేక శాంతి సమావేశం నిర్వహించారు. ?ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. ఒకరి మత సంప్రదాయాలను మరొకరు గౌరవించుకున్నప్పుడే సమాజంలో మత సామరస్యం వెల్లివిరుస్తుందని పేర్కొన్నారు. ఉత్సవాల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో శాంతి కమిటీ సమావేశాలు పూర్తి చేశామని, ర్యాలీల మార్గాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపడుతున్నామని స్పష్టం చేశారు.?సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే తప్పుడు సమాచారం, ఫార్వర్డ్ పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ గుడ్డిగా నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏదైనా మెసేజ్‌పై అనుమానం ఉంటే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించినా లేదా అల్లర్లకు కారణమయ్యే సందేశాలను ప్రచారం చేసినా ఉపేక్షించేది లేదని, సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

## మహమ్మద్ తాజుద్దీన్ కి నివాళులు అర్పించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్.



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: ఖమ్మం నగరంలో గుండెపోటుతో మరణించిన మైనారిటీ నాయకులు మహమ్మద్ తాజుద్దీన్ భౌతిక కాయానికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆర్.టీ.ఏ మెంబర్ గజ్జెల వెంకన్న, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, గౌస్, అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## సంజీవరెడ్డి భవన్‌లో ఘనంగా మహ్మద్ జావేద్ 50వ జయంతి వేడుకలు



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో స్వర్గీయ మహ్మద్ జావేద్ 50వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ హాజరయ్యారు. పీసీసీ మెంబర్, ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు స్వర్గీయ మహ్మద్ జావేద్ సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ప్రతిపక్షం లో ఉండి అధికార పక్షానికి ఎదురెల్లి ఎన్నో ప్రజా సమస్యలపై పోరాడిన రోజులను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు బీహెచ్ రబ్బానీ, షహీలా జావేద్, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు కిలారు అనిల్ కుమార్, ముక్రం అలీ ఖాన్, గాదెల ఝాన్సీ, జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ, నగర ఓబీసీ సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, నాయకులు షేక్ అబ్దుల్ రషీద్, జహీర్ భాయ్, జానీ, కిలారు రమణ, వేల్పుల మురళి, ఫజల్, వెంకట్రావు నాయక్, గడ్డికొప్పుల ఆనందరావు, బెజ్జం గంగాధర్, పర్వత శ్రీనివాస్, పంది రాజు గౌడ్, జొన్నలగడ్డ అరుణ, పేరం యశ్వంత్, బడే మియా, బొమ్మ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు

**విజయవంతమైన ఏఐటీయూసీ 17వ మహాసభలు**

**మహాసభ నిర్ణయాలను ప్రకటించిన ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు**






ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: ఆగస్టు 23 24 తేదీలలో సత్తుపల్లి పట్టణంలో ఏఐటియుసి 17వ జిల్లా మహాసభలు ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగాయని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు వెల్లడించారు. గిరి ప్రసాద్ భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. జి. క్లెమెంట్ తో కలిసి ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల లక్ష్యంగా భవిష్యత్తు పోరాటాలు నిర్వహిస్తామని , కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను ఉపసంహరించుకోవాలని, శతాబ్ద కాలంగా పోరాటాలు, త్యాగాలతో కార్మిక వర్గం సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మరలా పునరుద్ధరించాలన్నారు. కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదని కనీస వేతనం 26000 రూపాయలు అమలుకై పోరాటం చేస్తామన్నారు . ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మిక వర్గం పైనే ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం అంగన్వాడి లకు రు18000 వేతనం, మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రు 10000 అమలు చేయాలని , స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో ఖమ్మం జిల్లాలో గ్రానైట్ పరిశ్రమను ప్రోత్సహించి ఇండస్ట్రియల్ కారిడార్ను ఏర్పాటు చేయాలని , ఖమ్మం జిల్లా కేంద్రంగా ఈఎస్ఐ హాస్పిటల్ ను నిర్మించాలని సత్తుపల్లిలో ఆటోనగర్ ను ఏర్పాటు చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల పొట్ట కొట్టే సెంట్రల్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, తదితర తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందని ఆయన వెల్లడించారు. ఈ మహాసభకు జిల్లా 21 మండలాల నుండి ఏఐటియుసి అనుబంధ రంగాలు, సంఘాల నుండి 600 మంది కార్మిక ప్రతినిధులు హాజరయ్యారన్నారు. 77 మందితో నూతన కౌన్సిల్, 21 మందితో ఆఫీస్ బేరర్స్ ను ఏకగ్రీవంగా ఎన్నుకొనగా నూతన జిల్లా అధ్యక్షుడిగా రావి శివరామకృష్ణ , ప్రధాన కార్యదర్శిగా తోట రామాంజనేయులు రెండవసారి ఎన్నికయ్యారు అన్నారు. వీరితోపాటు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులుగా గాదె లక్ష్మీనారాయణ , ఉప ప్రధాన కార్యదర్శిగా సత్తుపల్లి ప్రాంతానికి చెందిన నిమ్మటూరి రామకృష్ణ కోశాధికారిగా ఏనుగు గాంధీ లను ఎన్నుకున్నారని తెలిపారు. ఎన్నికైన నూతన నాయకత్వం భవిష్యత్తులో కార్మిక వర్గ పోరాటాలను నిర్వహించాలని , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాదె లక్ష్మీనారాయణ, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సీతామహాలక్ష్మి, పగడాల మల్లేష్ , గొడ్డు గొర్ల శ్రీను, కోశాధికారి ఏనుగు గాంధీ. జిల్లా కార్యదర్శులు పెరబోయిన మోహన్ రావు, నాకేరేకంటి కృష్ణా, తదితరులు పాల్గొన్నారు.

# 22ఎ భూముల బాధితులకు అండగా గులాబీ దళం

**ఆగస్టు 29న అమీన్పూర్‌లో భారీ నిరసన సభ**

**హరీశ్‌రావు రాక.. 15 వేల మందితో పోరుబాట**





పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 25: పటాన్‌చెరు నియోజకవర్గంలో 22ఎ నిషేధిత జాబితాలో చేరిన భూములు, ఫ్లాట్లు, ప్లాట్ల బాధితులకు అండగా బీఆర్ఎస్ పార్టీ మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టనుంది. ఈ నెల 29న అమీన్పూర్ వేదికగా భారీ నిరసన సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సభకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో నిరసన సభ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. 22ఎ భూముల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. 22ఎ నిషేధిత జాబితా కారణంగా నియోజకవర్గంలో భూముల విక్రయాలు, రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. కష్టపడి సంపాదించిన డబ్బుతో భూములు, ఫ్లాట్లు కొనుగోలు చేసిన పేద, మధ్యతరగతి కుటుంబాలు సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. సంవత్సరాలుగా భూములను సాగు చేసుకుంటూ, ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్న కుటుంబాలకు 22ఎ జాబితా తీవ్ర సమస్యగా మారిందన్నారు. అర్హత ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ పోరాటం చేపడుతున్నట్లు తెలిపారు. హరీశ్‌రావు ఆదేశాల మేరకు ఈ నెల 29న శనివారం అమీన్పూర్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామని, సుమారు 15 వేల మంది సభకు హాజరుకానున్నారని ఎమ్మెల్యే తెలిపారు. సభను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, 22ఎ భూముల బాధితులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా పోచమ్మ బోనాల పండుగ



**ఆడపడుచులకు అమ్మవారి దీవెనలు**

వనపర్తి ఆగస్టు25 క్రైమ్ మిర్రర్ తెలంగాణ సంస్కృతి, సంప్రాదాయాలకు చిహ్నమైనా బోనాల పండుగను పెబ్బేరు లో మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. పెబ్బేరు మండలంలోని తదితర ప్రాంతాల్లో పెబ్బేరు పట్టణంలో మరియు చెలిమిళ్ల, రంగాపురం, బునియాదిపురం, పెంచికలపాడు,కంచిరావుపల్లి,గ్రామాల్లో భక్తులు బోనాలతో పెద్ద సంఖ్యలో ఆలయాలకు భారులు తీరారు. బోనాల పండుగ సందర్బంగా నిర్వహకులు ఆలయాలను అందమైనా రంగులతో ముస్తాబు చేశారు. శ్రావణ మాసంలో గ్రామదేవతలను కొలిచి బోనాలు సమర్పిస్తే సంవత్సరమంతా అమ్మవారి దయా కటాక్షము తమపై ఉండాలని అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు సమర్పించడం అనాదిగా తెలంగాణలో వస్తున్నా సంప్రాదాయం మహిళ భక్తులు పవాసదీక్షలతో బోనాలను నెత్తిమీద పెట్టుకోని ఊరేగింపుగా తీసుకు వచ్చి అమ్మవార్లకు సమర్పించారు. చిన్నారులు కూడ బోనాలు మోయడం విశేషం. ముఖ్యంగా పోతురాజుల విన్యాసాలతో బాజ భజంత్రీలతో, శివసత్తుల అటపాటలతో అద్యాత్మికంగా బోనాల జాతరలు అయా గ్రామాల్లో కొనసాగాయి. ఈసందర్బంగా పలువురు భక్తులు మాట్లాడుతూ ప్రకృతిని కొలిచే సంప్రాదాయం తెలంగాణ సంస్కృతి లో ఉన్నదని శ్రావణ మాసంలో గ్రామాల్లో వర్షాలకు చిన్నపిల్లలకు,పెద్దలకు అంటురోగాలు వ్యాపించకుండా గ్రామదేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం తెలంగాణలో అనాదిగా వస్తున్నా అచారమని అన్నారు. కార్యక్రమంలో భక్తులు. అధిక సంఖ్యలో పాల్గొన్నారు తీవ్రమైన సామాజిక, శాంతిభద్రతల, జాతీయ భద్రతా సవాలుగా పరిణమించింది" అని ఆయన అన్నారు. వార్త వర్క్‌షాప్ ద్వారా.. కచ్చితమైన సమాచారమూ, బాధ్యతాయుతమైన రిపోర్టింగ్ విధానాలతో జర్నలిస్టులను సన్నద్ధులను చేయడమే పీఐబీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తద్వారా వారు నషా ముక్త్ భారత్ అభియాన్‌కు అర్థవంతంగా దోహదపడి, మాదకద్రవ్యాల వ్యాప్తిని నివారించడంలో దోహదపడతాం"న్నారు. అనంతరం వక్తలతో... జర్నలిస్టులు మాట్లాడారు. కార్యాచరణ సమస్యలు,పునరావాస సేవల లభ్యత, మాదకద్రవ్యాల సంబంధిత కథనాల రిపోర్టింగ్ వంటి విషయాలపై వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పీఐబీ– హైదరాబాద్ మీడియా– కమ్యూనికేషన్ అధికారి వర్గంటి గాయత్రి కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 60 మంది మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# కిష్టారెడ్డిపేట్ దుర్గానగర్‌లో రోడ్డెక్కిన డ్రైనేజీ మురుగు

**అమీన్‌పూర్ మున్సిపల్ అధికారుల తీరుపై కాలనీవాసుల ఆగ్రహం**

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 25: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట్ దుర్గానగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. గత కొద్ది రోజులుగా కాల్వలు పొంగిపొర్లి మురుగునీరు రోడ్లపై ఏరులై పారుతుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్యపై పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోకపోవడంపై కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ?రోడ్లపై మురుగు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడద పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రధాన మార్గాల్లో మురుగు ప్రవహిస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పన్నులు వసూలు చేయడంలో చూపించే శ్రద్ధ పారిశుధ్య నిర్వహణ, ప్రజారోగ్యంపై ఎందుకు చూపడం లేదని అమీన్‌పూర్ మున్సిపల్ అధికారులను స్థానికులు నిలదీస్తున్నారు. ?ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రత్యక్ష ఆందోళన చేపడతామని దుర్గానగర్ కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.



# ఆర్టీసీ కార్మికులు మరో పోరాటానికి సిద్ధం కండి

## ప్రభుత్వం ఆర్టీసీ యాజమాన్యం అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలి

## ఖమ్మం డిపో వద్ద నిరాహారదీక్షా శిబిరాన్ని ప్రారంభిస్తూ సిఐటియు, ఎస్ డబ్ల్యూ ఎఫ్ నేతల పిలుపు

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ప్రభుత్వం ఆర్టీసీ యాజమాన్యం అంగీకరించిన అంశాలను అమలుకు వెంటనే సర్కులర్ విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల కమిటీ అంగీకరించిన అంశాల అమలు కోసం ఆర్టీసీ కార్మికులు మరో సమస్యల పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు ఖమ్మం జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు కళ్యాణ వెంకటేశ్వర్లు తుమ్మ విష్ణువర్ధన్ ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర ఉత్తర ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తులు పిలుపునిచ్చారు మంగళవారం ఉదయం ఖమ్మం బస్సు డిపో వద్ద గుగ్గిళ్ల రోశయ్య అధ్యక్షతన ఏర్పాటైన దీక్షా శిబిరాన్ని కళ్యాణం వెంకటేశ్వర్లు, తుమ్మ విష్ణువర్ధన్, గడ్డం లింగమూర్తి లు ప్రారంభించారు. ప్రభుత్వం వెంటనే విలీన కమిటీని నియమించాలని, గుర్తింపు ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రభుత్వం యాజమాన్యం అంగీకరించిన అంశాలను అమలు చేయాలని నినాదించారు.నిరాహార దీక్షలో గడ్డం వెంకటయ్య, పగిళ్లపల్లి నరసింహారావు, ఎన్.శ్రీనివాసు,మద్దెల బాబు, వి.శ్రీనివాసు, లక్ష్మీ భవాని, వి.రమేష్ కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి కళ్యాణం వెంకటేశ్వర్లు గడ్డం లింగమూర్తు లు ప్రసంగిస్తూ ఖమ్మం రీజినల్ యాజమాన్యం రీజయన్ లోని కార్మిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని, కార్మిక సమస్యల పరిష్కారం పట్ల అలసత్వం వహిస్తే ఆర్టీసీ కార్మికులకు అండగా పోరాటంలో సిఐటియు పాల్గొంటుందని తెలియజేశారు.వెంటనే న్యాయమైన ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని,వేతన బకాయిలు చెల్లించాలని,ఉద్యోగ భద్రత విధి విధానాలు



రూపొందించాలని,కార్మికులు ప్రశాంతంగా విధులు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని,పెంచిన పని భారాలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.

**దీక్షలకు ఆర్టీసీ టీఎంయూ సంఘీభావం**

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరాహార దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఎస్ డబ్ల్యూ ఎఫ్ నాయకత్వానికి ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఖమ్మం రీజినల్ అధ్యక్షులు గుర్రం ఉప్పలయ్య ఖమ్మం డిపో కార్యదర్శి మెరుగు రవీంద్రనాథ్ వారి జిల్లా డిపో కమిటీల నాయకత్వం దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావం తెలియజేశారు. ఎస్ డబ్ల్యూ ఎఫ్ చేస్తున్న పోరాటాన్ని వారు అభినందించారు.కార్మికుల పక్షాన చేసే న్యాయమైన పోరాటాలకు టీఎంయూ ఎల్లప్పుడూ సంఘీభావాన్ని,మద్దతును తెలియజేస్తుందని వారు ప్రకటించారు.

**ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ దీక్షల డిమాండ్లు**

1)ప్రభుత్వం, యాజమాన్యం అంగీకరించిన అంశాలను అమలు చేయాలి.

2) ఈడీ కమిటీ చర్చల ప్రొసీడింగ్స్‌ను వెంటనే యూనియన్లకు ఇవ్వాలి. 3)అలవెన్సులను 80 శాతం పెంచాలి.

4) 2021 పే స్కేల్, అరియర్స్‌పై స్పష్టతనిచ్చి చెల్లించాలి.

5) బ్రెడ్ విన్నర్ స్కీం ఉద్యోగులను రెగ్యులర్ చేసి, చేరిన రోజు నుంచి సర్వీసును పరిగణించాలి.

6)జూనియర్ అసిస్టెంట్ టెస్ట్ పాసైన వారికి ప్రమోషన్లివ్వాలి.

7)ఉద్యోగ భద్రత కల్పించి, అవసరమైన రెగ్యులేషన్స్ సవరించాలి.

8)మెకానికల్ సిబ్బందికి జూనియర్ అసిస్టెంట్ (మెటీరియల్) పరీక్ష నిర్వహించి ప్రమోషన్లతో పోస్టులు భర్తీ చేయాలి. 9)పని భారాలపై డిపో, రీజియన్ స్థాయిలో కార్మిక సంఘాలతో చర్చించాలి.

10) పెంచిన పని భారాన్ని తగ్గించాలి.

11)రిటైర్డ్ కార్మికుల బకాయిలను తక్షణమే చెల్లించాలి.

స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్ ప్రచార కార్యదర్శి తోకల బాబు,రాష్ట్ర నాయకులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ విష్ణువర్ధన్ టీఎంయూ డిపో కార్యదర్శి మెరుగు రవీంద్రనాథ్ రీజనల్ అధ్యక్షులు గుండు మాధవరావు రీజనల్ నాయశకులు జిల్లేపల్లి ఉపేంద్రాచారి రీజినల్ మహిళా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ డి. సరిత ప్రసంగించిన ఈ దీక్ష శిబిరం సాయంత్రం కీత పద్మ సిహెచ్ విజయలక్ష్మి పద్మక్క ఝాన్సీ కుమారి శాంత కుమారి షేక్ రబ్బాని కృష్ణార్జున రావు తదితరులు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింప చేశారు.

# వార్త మీడియా వర్క్ షాప్ (పి ఐ బి )ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్....!

## డ్రగ్స్ మహమ్మారిపై పోరాడుదాం...నవ యువకులను కాపాడుదాం...

## సంపూర్ణ మాదక ద్రవ్యాలను నిర్మూలించడమే... నషా ముక్త్ భారత్ లక్ష్య సాధన...!

## పోలీసులు – మీడియా మధ్య బలమైన సమన్వయం ఉండాలి --- డిసిపి నారాయణ రెడ్డి

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్)** పత్రికా సమాచార కార్యాలయం– (పి ఐ బి )హైదరాబాద్ ఆధ్వర్యంలో.. మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ) కార్యక్రమంపై రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మీడియా ప్రతినిధులకు వార్త మీడియా వర్క్‌షాప్‌ను ఈ రోజు నిర్వహించారు.మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణ రెడ్డి (ఐపీఎస్) ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈగల్ ఫోర్స్ పోలీస్ సూపరింటెండెంట్ రావుల గిరిధర్ (ఐపీఎస్), పీఐబీ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, మహేశ్వరం ఎంపీడీవో ఎన్. శారదమ్మ ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.మహేశ్వరం జోన్ డీసీపీ శ్రీ కె. నారాయణ రెడ్డి (ఐపీఎస్) మాట్లాడుతూ...డ్రగ్స్ భూతాన్ని ఎదుర్కొనేందుకు చట్టపరమైన ఆంక్షలు మాత్రమే సరిపోవు.. ప్రజలందరి భాగస్వామ్యంతోనే దాన్ని సమర్థంగా కట్టడి చేయగలం అన్నారు.మాదకద్రవ్య నివారణ చర్యలు ఇళ్లలోనే, బడుల్లోనే మొదలుకావాలన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, సహచరులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సకాలంలో సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా డ్రగ్స్ ముప్పును సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను కాపాడుకోవడాన్ని శాంతిభద్రతల అంశంగా మాత్రమే చూడలేమన్నారు. వారి ఆరోగ్యాన్నీ, నైపుణ్యాన్నీ, సామర్థ్యాన్నీ పెంపొందించడంలోనూ ఇది అత్యావశ్యకమన్నారు.మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాలు.. నేడు దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా మారాయని కె.నారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు.మాదకద్రవ్య రహిత భారత్ నిర్మాణం దిశగా ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ధ్రువీకృత సమాచారాన్ని ప్రసారం చేయాలనీ,మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను చెప్పాలనీ, డ్రగ్స్ బారిన పడకుండా యువతను ముందస్తుగానే జాగరూకులను చేయాలనీ, కౌన్సెలింగ్ – పునరావాస



సేవలపై ప్రజలకు తగిన సమాచారాన్ని అందించాలనీ మీడియా సిబ్బందిని ఆయన కోరారు.

**మాదకద్రవ్యాలను అరికట్టే దిశగా సమన్విత చర్యలను వివరించిన ఈగల్ ఫోర్స్ ఎస్పీ**

'నషా ముక్త్ భారత్ అభియాన్'పై అవగాహన సదస్సులో తెలంగాణ ఈగల్ ఫోర్స్ పోలీసు సూపరింటెండెంట్ రావుల గిరిధర్ (ఐపీఎస్) మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత,కుటుంబ సమస్య స్థాయిని దాటి.. నేడు తీవ్రమైన సామాజిక,శాంతిభద్రతల, జాతీయ భద్రతా సవాలుగా పరిణమించిందన్నారు. ఈ ముప్పును ఎదుర్కొనే దిశగా సంబంధిత భాగస్వామ్య పక్షాలన్నీ సమన్వయంతో కృషి చేయాలన్నారు.జనవరి నుంచి తెలంగాణలో దాదాపు 8 వేల కేజీల గంజాయిని ఈగల్ ఫోర్స్ సీజ్ చేసిందని ఆయన తెలిపారు.దాదాపు 22 రకాల శిక్షణ కార్యక్రమాల ద్వారా 30 వేల మందికి పైగా పోలీసు సిబ్బందికీ, ఇతర శాఖల అధికారులకూ శిక్షణ ఇచ్చినట్టు పేర్కొన్నారు.ఈ సమన్విత చర్యల్లో మీడియా సిబ్బంది పాత్ర అత్యంత కీలకమైనదని రావుల గిరిధర్ అన్నారు. బాధ్యతాయుతమైన, సున్నితత్వంతో కూడిన రిపోర్టింగ్ ద్వారా.. యువతలో అవగాహనను పెంపొందించవచ్చునీ, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చునీ, పునరావాస చర్యలను ప్రోత్సహించవచ్చునీ పేర్కొన్నారు.మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసులను నివేదించేటప్పుడు కచ్చితత్వాన్నీ, సున్నితత్వాన్నీ దృష్టిలో పెట్టుకోవాలని మీడియా సిబ్బందిని కోరారు. ముఖ్యంగా మైనర్ల వివరాలను



గోప్యంగా ఉంచాలనీ, మాదకద్రవ్యాల బారిన పడ్డవారి వ్యక్తిగత వివరాలను అనవసరంగా బహిర్గతం చేయొద్దనీ సూచించారు.నషా ముక్త్ భారత్ లక్ష్య సాధనలో.. పోలీసులు – మీడియా మధ్య బలమైన సమన్వయం, జాగరూకతతో కూడిన ప్రజల భాగస్వామ్యం అత్యావశ్యకమని ఆయన వ్యాఖ్యానించారు.పీఐబీ– హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ ప్రారంభోపన్యాసం చేశారు. "డ్రగ్స్ ముప్పు ఇకపై వ్యక్తిగత సమస్యో, కుటుంబ సమస్యో కాదనీ, నేడు ఇదొక తీవ్రమైన సామాజిక, శాంతిభద్రతల, జాతీయ భద్రతా సవాలుగా పరిణమించింది" అని ఆయన అన్నారు.వార్త వర్క్‌షాప్ ద్వారా.. కచ్చితమైన సమాచారమూ, బాధ్యతాయుతమైన రిపోర్టింగ్ విధానాలతో జర్నలిస్టులను సన్నద్ధులను చేయడమే పీఐబీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తద్వారా వారు నషా ముక్త్ భారత్ అభియాన్‌కు అర్థవంతంగా దోహదపడి, మాదకద్రవ్యాల వ్యాప్తిని నివారించడంలో దోహదపడతారన్నారు.అనంతరం వక్తలతో... జర్నలిస్టులు మాట్లాడారు. కార్యాచరణ సమస్యలు,పునరావాస సేవల లభ్యత, మాదకద్రవ్యాల సంబంధిత కథనాల రిపోర్టింగ్ వంటి విషయాలపై వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు.పీఐబీ– హైదరాబాద్ మీడియా– కమ్యూనికేషన్ అధికారి వర్గంటి గాయత్రి కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 60 మంది మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డబల్ బెడ్ రూమ్ కాలనీ వద్ద వన మహోత్సవం

## మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి ఆగస్టు 25 క్రైమ్ మిర్రర్:** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని డబల్ బెడ్ రూమ్ కాలనీ సమీపంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, కమిషనర్ గణేష్, వైస్ చైర్మన్ సుమిత్ర, స్థానిక కౌన్సిలర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని కాలనీ పరిసరాల్లో మొక్కలు నాటారుబిఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.బి మున్సిపల్ కమిషనర్ గణేష్ మాట్లాడుతూ.. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, అవి పెరిగి పెద్దయ్యే వరకు సంరక్షించడమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. కాలనీవాసులు నాటిన మొక్కల సంరక్షణలో భాగస్వాములై పరిసరాలను పచ్చదనంతో నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, పలువురు వార్డు కౌన్సిలర్లు మంగరాయి మన్యం,పర్వీన్ షకీల్, జమ్ములమ్మ, శివసాయి, తాటికొండ కృష్ణ, భాగ్యలక్ష్మి శివ, పట్టణ అధ్యక్షులు కొంతం దయాకర్ రెడ్డి,మాజీ వార్డ్ మెంబర్ సుధాకర్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు






# మిర్యాలగూడ అభివృద్ధిపై విస్తృత చర్చ

## ప్రజావసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో పనులు



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్,ఆగస్టు 25: పట్టణ అభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి, ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) సూచించారు. మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మున్సిపల్ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మున్సిపల్ ఛైర్మన్ చిలుకూరు సుధా బాలకృష్ణ, వైస్ ఛైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, కమిషనర్ శ్రీజారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పట్టణంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు విస్తృతంగా చర్చించారు.

**మౌలిక వసతులపై దృష్టి**

పట్టణంలో మౌలిక వసతుల మెరుగుదల, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ తదితర ప్రజావసరాలపై ప్రత్యేకంగా చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన పనులను గుర్తించి, వాటిని వేగంగా పూర్తి చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని బీఎల్ఆర్ సూచించారు.మిర్యాలగూడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల అవసరాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.పట్టణ అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశంలో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని, మిర్యాలగూడను మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని బీఎల్ఆర్ తెలిపారు.సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# పెదనెమిలలో ఘనంగా వన మహోత్సవం



**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుదల లక్ష్యంగా మండల పరిధిలోని పెదనెమిల గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురకంటి లావణ్య మధుసూదన్ రెడ్డి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షిస్తేనే పచ్చని పర్యావరణంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలం అని అన్నారు.నేటి మొక్కే రేపటి ప్రాణవాయువు --- పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈనాటి కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు బాశనపెల్లి మల్లయ్య,గ్రామ పంచాయతీ సెక్రటరీ పట్టెటి శృతి, ఉప సర్పంచ్ వల్లమళ్ళ నరేష్, వార్డ్ మెంబర్లు సంధ్య, చంద్రయ్య, అంగన్వాడి టీచర్లు నిర్మల,కవిత,వివోఏ భవానీ ఉపాధి హామీ కూలీలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# సుగూరు ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

## ప్రారంభించిన సర్పంచ్ యాదమ్మ పరశురాం

**వనపర్తి ఆగస్టు 25 క్రైమ్ మిర్రర్:** విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో సుగూర్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను. సర్పంచ్ యాదమ్మ పరశురాం. మరియు మండల విద్యాధికారి జయరాములు. కంప్యూటర్ ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యాదమ్మ. మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యతో అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలను మరింత పెంపొందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. డిజిటల్ విద్య వైపు సుగూర్ మరో ముందడుగు వేసిందని పలువురు అభిప్రాయపడ్డారు.



# 'కాష్మోరా' మ్యాజిక్ రిపీట్.. కార్తీ నయనతార కాంబోలో భారీ చిత్రం!






కొన్ని కాంబినేషన్లు మొదటి నుంచి ఆసక్తిని క్రియేట్ చేస్తాయి. చిత్రాలకు హైప్ తీసుకొస్తాయి. అలా తాజాగా నటుడు కార్తీ హీరోగా నటించడానికి సిద్ధం అవుతున్న చిత్రం ఫేమ్ థింగ్ స్పెషల్‌గా మారుతోంది. ఈయన ప్రస్తుతం నటిస్తున్న చిత్రాల్లో సర్దార్--2 ఒకటి . కార్తీ తండ్రి కొడుకులుగా ద్విపాత్రాభినయం చేసిన ఈ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబు అవుతోంది. దీంతో పాటూ మార్షల్ చిత్రం షూటింగ్ దశలో ఉంది. అంతేకాకుండా మరో మూడు చిత్రాలు కమిట్ అయ్యారు. అందులో తెలుగు చిత్రం హిట్ --3 కూడా ఉంది. కాగా తాజాగా మోహన్ రాజా దర్శకత్వం ఒక చిత్రం చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్.లక్ష్మణన్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం గురించే కోలీవుడ్లో పెద్ద చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఈ చిత్రంలో నటించే కథానాయకి ఎవరన్న విషయంలో తాజాగా నటి నయనతార పేరు వెలుగులోకి వచ్చింది. 40 వసంతాలు దాటినా అగ్ర కథానాయికిగా రాణిస్తున్న ఈ పాన్ ఇండియా భామను అటు ఉత్తరాది, ఇటు దక్షిణాదిలోనూ భారీ అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. హిందీలో ప్రస్తుతం సల్మాన్ ఖాన్‌కు జంటగా ఒక చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం కోసం ఆమె ఒక తెలుగు చిత్రాన్ని వదులు కున్నట్లు ప్రచారం జరిగింది. కాగా తమిళంలో నటిస్తున్న మూకుత్తి అమ్మన్-- 2 చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఇవి కాక రాకాయి, మన్నాంగట్టి, మలయాళ చిత్రం డియర్ స్టూడెంట్ చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయి. అదే విధంగా కవిన్‌కు జంటగా నటిస్తున్న హాయ్ చిత్రం షూటింగ్ ను పూర్తి చేసుకుని నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఇక యష్‌తో కలిసి నటించిన టాక్సిక్ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధం అవుతోంది. విశేషం ఏమిటంటే ఇందులో ఈమె ప్రతినాయకిగా నటించినట్లు సమాచారం. ఇకపోతే కార్తీతో కలిసి ఇంతకు ముందు కాష్మోరా చిత్రంలో నటించిన నయనతార ఇప్పుడు మరోసారి ఆయనతో జత కట్టడానికి సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇంకా షూటింగ్ ప్రారంభం కాక ముందే ఈ చిత్రంపై ఆసక్తి నెలకుంటోంది.



## ఈ సారి అలా చేస్తే సహించను

# కంటెస్టెంట్లకు వార్నింగ్

బుల్లితెర రియాలిటీ షో బిగ్‌బాస్ షోకు అంతా రెడీ అవుతోంది. ఇప్పటికే హిందీ బిగ్‌బాస్ తేదీని కూడా రివీల్ చేశారు. ఇటీవలే ప్రోమో రిలీజ్ చేసి సెప్టెంబర్ 6 నుంచి ప్రారంభం కానుందని ప్రకటింటచారు. దీంతో టాలీవుడ్ అభిమానులు సైతం తెలుగు సీజన్-10 ఎప్పుడా అని ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సందర్భంగా హోస్ట్ నాగార్జున పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిగ్‌బాస్ సీజన్-10 ప్రోమో షూటింగ్ ఇటీవలే పూర్తయిందని నాగ్ వెల్లడించారు. ఈ సారి పదో సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సీజన్ మరింత ఉన్నతంగా ప్లాన్ చేస్తున్నారని.. గతం కంటే ఆసక్తికరంగా ఉంటుందని తెలిపారు. ఇతరుల ప్రవర్తనను నిర్ణయించడం, సూచనలు చేయడం నాకిష్టం ఉండదన్నారు. అందుకే మొదటి రెండు సీజన్లలో కాస్త ఇబ్బంది పడ్డానని.. ఆ తర్వాత షో ఫార్మాట్ అలవాటైందని వెల్లడించారు. గత సీజన్ సూపర్ హిట్ కావడంతో ఈసారి ఫిజికల్ టాస్కులు మరింత కఠినంగా ఉండబోతున్నాయని హింట్ ఇచ్చారు. అంతే కాకుండా ఈ రియాలిటీ షోలో కంటెస్టెంట్లు హద్దులు దాటి ప్రవర్తిస్తే అస్సలు సహించనని నాగ్ స్పష్టం చేశారు.



# డిసెంబరులో రిలీజ్?

'తండేల్' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వృషకర్మ'. ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, 'లాపతా లేడీస్' మూవీ ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా నటిస్తున్నారు. 'విరూపాక్ష' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న కార్తీక్ వర్మ దండు దర్శకత్వం వహిస్తున్నారు. బాపినీడు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ .బి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు రానుందనే టాక్ వినిపిస్తోంది. పౌరాణిక నేపథ్యం, థ్రిల్లింగ్ కథనంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తన పాత్ర కోసం నాగచైతన్య ఫిజికల్‌గా కొత్తగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. ఈ విషయాన్ని మార్చి 5న విడుదలైన గ్లింప్స్ స్పష్టం చేసింది. తన కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన కథను ఎంచుకుని 'వృష కర్మ'తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు చైతన్య. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. అయితే ఈ సినిమా విడుదల తేదీపై చిత్రయూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు రానుందనే వార్త ప్రచారంలోకి వచ్చింది. కాగా ఈ చిత్రానికి అజనీష్ బి. లోక్‌నాథ్ సంగీతం అందిస్తుండగా, రాగుల్ డి. హెరియన్ కెమెరామేన్‌గా వ్యవహరిస్తున్నారు.

# భావోద్వేగాల స్పిరిట్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియన్ మూవీ 'స్పిరిట్'. 'అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్' చిత్రాల ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో 'యానిమల్' మూవీ ఫేమ్ తృప్తీ దిమ్రీ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రకాష్‌రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన కీలక పాత్రలు పోషిస్తున్నారు. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ--సిరీస్ బ్యానర్స్‌పై ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, కృష్ణన్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ తొలిసారి పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. పోలీస్ అనగానే పవర్‌ఫుల్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం సాగుతుందని అనుకుంటారు. అయితే ఈ సినిమాలో భావోద్వేగాలకు కూడా ఎంతో ప్రాధాన్యం ఉందట. ఈ విషయాన్ని చిత్ర నిర్మాతల్లో ఒకరైన భూషణ్ కుమార్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. "స్పిరిట్' లో తన కెరీర్‌లోనే మోస్ట్ ఇంటెన్స్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు ప్రభాస్. తన మార్క్ యాక్షన్, ఎమోషన్స్‌తో అద్భుతమైన అనుభూతిని ఇచ్చేలా తీర్చిదిద్దుతున్నారు సందీప్. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలను చూశాను. పోలీస్ స్టోరీ కథ అయినప్పటికీ కుటుంబ నేపథ్యం, బలమైన భావోద్వేగాలు ఉంటాయి. మునుపెన్నడూ చూడని సినిమా ఇది అని ప్రేక్షకులు భావిస్తారు" అని పేర్కొన్నారు. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ్, మలయాళ, కన్నడతో పాటు చైనీస్, జపనీస్, కొరియన్ సహా మొత్తం 8 భాషల్లో 2027 మార్చి 5న విడుదల కానుంది.





## అది తెలియకపోవడం అవమానమే

# విద్యార్థులకు ధనుశ్ చురకలు

కోలీవుడ్ హీరో ధనుశ్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. చెన్నైలో తన సొంత నిధులతో నిర్మించిన స్కూల్ భవనాన్ని ప్రారంభించారు. ఆ పాఠశాల పూర్వ విద్యార్థి అయిన ధనుశ్.. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మీరంతా మాతృభాష పట్ల శ్రద్ధ చూపాలని అన్నారు. తమిళం రాకపోవడం కరెక్ట్ కాదని.. అది నిజంగా సిగ్గుచేటని విద్యార్థులకు చురకలంటించారు. ఈ సందర్భంగా ధనుష్ తన పాఠశాల రోజులను గుర్తుచేసుకున్నారు. ఇతర భాషలలో ప్రావీణ్యం సంపాదించే ముందు విద్యార్థులు మొదట తమ మాతృభాషను చదవడం, రాయడం నేర్చుకోవాలని ధనుశ్ విజ్ఞప్తి చేశారు. ధనుశ్ మాతృభాష గురించి మాట్లాడుతూ.. "ఒకరు మొదట తమ మాతృభాషను నేర్చుకోవాలి. వారు మొదట దానిని చదవడం, రాయడం నేర్చుకోవాలి. మీకు తమిళం రాదని చెప్పడం గర్వించదగిన విషయం కాదు. మీ మాతృభాష తెలియకపోవడం నిజానికి అవమానకరం. దయచేసి మీ మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వండి. దయచేసి తమిళంపై కూడా దృష్టి పెట్టండి" అని విద్యార్థులకు సూచించారు. ధనుశ్ మాట్లాడుతూ..'చిన్నప్పుడు తాను ఇంగ్లీషుతో ఇబ్బంది పడినప్పటికీ.. తమిళంలో మాత్రం ఎప్పుడూ అనర్గళంగా మాట్లాడేవాడినని గుర్తుచేసుకున్నారు. నేను ఇక్కడ చదువుతున్నప్పుడు నాకు ఇంగ్లీష్ సరిగ్గా వచ్చేది [illegible]


Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.